సంపుటి : 18 సంచిక : 137
Vol : 18 Issue : 137

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, శనివారం 25 జూలై 2026
Warangal, Saturday 25 July 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts



WANTED
పీపుల్స్ డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
• హనుమకొండ • కరీంనగర్
• భూపాలపల్లి • పెద్దపల్లి/రామగుండం
• జనగామ • మహబూబాబాద్
• హైదరాబాద్ • నిజామాబాద్
Cell : 9493019044
9618509859




# మూడో లైన్ కంప్లీట్

- రైలు ప్రయాణికులకు గుడ్‌న్యూస్..
- ఢిల్లీ సహా ఉత్తరాదికి వేగంగా ప్రయాణం
- కాజీపేట-బల్హార్షా రూట్‌లో పూర్తయిన పనులు

2వ పేజీలో..






# పదేళ్ల జైలు... పదికోట్ల జరిమానా

- పేపర్ లీక్‌లపై కఠిన చట్ట సవరణకు గ్రీన్‌సిగ్నల్
- మూడు నెలల్లో దర్యాప్తు పూర్తి
- ట్రాక్ కోర్టులకు చట్టబద్ధ హోదా
- కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయాలు

2లో

# కందికి కొత్త రంది...




- రైతులకు 'గ్రీన్ ప్లేగు' వైరస్ హెచ్చరిక
- శాస్త్రీయ పరిశోధనలతో ఆందోళన
- అదిసోకితే 90 శాతం దిగుబడి కోల్పోయే అవకాశం
- ప్రస్తుతం ప్రమాదం ఏమీలేదు...
- 2050 వరకు దేశవ్యాప్తంగా విస్తరించే ఛాన్స్
- తెలంగాణకు అధిక ముప్పు ఉంటుందట

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** కంది సాగు చేసే రైతులకు తీవ్ర ఆందోళన కలిగించే అంశాలు వెలుగులోకి వచ్చాయి. 'పిజియన్‌పీ స్టెరిలిటీ మొజాయిక్ డిసీజ్' (పీపీఎస్ఎమ్‌డీ) అనే వైరల్ వ్యాధి కంది పంటకు భారీ నష్టం కలిగించే ప్రమాదం ఉందని తాజా శాస్త్రీయ పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. వ్యవసాయ రంగంలో ఈ వ్యాధిని 'గ్రీన్ ప్లేగు'గా పిలుస్తారని పరిశోధకులు తెలిపారు. పంట ప్రారంభ దశలోనే ఈ వైరస్ సోకితే దిగుబడిలో 90 శాతం వరకు నష్టం సంభవించే అవకాశముందని వెల్లడించారు.

'పిజియన్‌పీ స్టెరిలిటీ మొజాయిక్ వైరస్' వల్ల ఈ వ్యాధి వస్తుంది. 'అసేరియా కజాని' అనే నల్లి జాతి సూక్ష్మ కీటకం ఈ వైరస్‌ను ఒక మొక్క నుంచి మరో మొక్కకు వ్యాప్తి చేస్తుంది. వ్యాధి సోకిన మొక్కల ఆకులు లేత ఆకుపచ్చ రంగులోకి మారడంతో పాటు చిన్నవిగా, గుబురుగా మారతాయి. అనంతరం మొక్కలకు పూత, కాయలు రాకపోవడంతో చివరకు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

**తెలంగాణలో అధిక ముప్పు**

2026 జూన్ 10న 'ఫ్రంటియర్స్ ఇన్ ఆగ్రోనమీ' జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధనలో ఈ వ్యాధి భవిష్యత్ వ్యాప్తిపై కీలక అంశాలు వెల్లడయ్యాయి. 2050, 2070 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని 'మాక్స్ ఎంట్ మోడలింగ్' పద్ధతిలో నిర్వహించిన (మిగతా 2లో...)



# చదువుల తల్లి... కార్పొ'రేట్' బంది

- అక్షరాలతో అక్రమ వ్యాపారం
- అనుమతి ఒక్కటి... బ్రాంచీలు అనేకం
- నర్సరీ నుంచి ఇంటర్ వరకు విచ్చలవిడి యాపారం
- అకాడమీల పేరుతో మాయాజాలం
- పర్మిషన్లు లేకుండానే లక్షల్లో దోపిడీ
- పుస్తకాలు, యూనిఫాంలు అంటూ అధిక ధరలతో వసూళ్ల పర్వం
- హాస్టల్ అంటూ లక్షల్లో గుంజుడే...
- రుచిపచి లేని భోజనాలతో విద్యార్థుల ఇబ్బందులు
- అధికారులు మాత్రం కన్నెత్తి చూడరు..
- విద్యాశాఖకు ఎంత ముట్టజెప్పుతున్నారో?

2వ పేజీలో..

✍ కొండపర్తి కిరణ్ (పీపుల్స్‌డైరీ-ప్రధాన ప్రతినిధి)

# మీదపడ్డ మృత్యువు...

- పసికందుతో సహా 13 మంది దుర్మరణం!
- పాపం.. ప్రకృతి పగబట్టిందా...?
- క్షణాల వ్యవధిలో నుజ్జునుజ్జు అయిన శరీరాలు



**పీపుల్స్‌డైరీ-క్రైం బ్యూరో :** దేవభూమిగా పిలిచే హిమాచల్ ప్రదేశ్‌లో పకృతి పగబట్టింది. పచ్చని కొండల నడుమ రాకపోకలు సాగిస్తున్న అమాయక ప్రయాణికులపై మృత్యువు కొండచరియల రూపంలో విరుచుకుపడింది. రోడ్డు మూతపడటంతో రాత్రంతా ఒకేచోట వేచి చూసి, తెల్లవారాక దారి తెరచుకోవడంతో ఊపిరిపీల్చుకుని ప్రయాణం మొదలుపెట్టిన ప్రయాణికులను విధి వంచించింది. లాహౌల్-స్పితి జిల్లాలోని సాన్సారీ-కిల్లార్-తాండి మార్గంలో కాడు నాలా సమీపంలో శనివారం చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో టాటా సుమో వాహనంపై భారీగా బండరాళ్లు, మట్టిచరియలు పడి (మిగతా 2లో...)

# ఏపీ, తెలంగాణకు భారీ వర్షసూచన..

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** సముద్ర మట్టానికి ఉన్న రుతుపవన ద్రోణి ఇప్పుడు జైసల్మేర్, ఆగ్నేయ రాజస్థాన్, దాని పరిసర ప్రాంతాలలోని అల్పపీడన ప్రాంత కేంద్రం, గుణ, సిద్ధి, డాల్టన్‌గంజ్ మీదుగా వెళ్లి అక్కడి నుండి ఆగ్నేయంగా ఈశాన్య బంగాళాఖాతం వైపుకు విస్తరిస్తోంది. దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో రాబోయే మూడ్రోజుల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో గంటకు 30-40 కి.మీ వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని స్పష్టం చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయి వీటి ఫలితంగా ఏపీలో రాగల మూడు రోజుల వరకు వానలు కురవనున్నాయని అమరావతి వాతావరణశాఖ స్పష్టం చేసింది.

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది . బలమైన గాలులు గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో వీచే (మిగతా 2లో...)

# సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష విరమణ..

## ఉద్యమ నేతకు ప్రధాని మోదీ కీలక విజ్ఞప్తి




**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** పరీక్ష పత్రాల లీకేజీ అక్రమాలకు వ్యతిరేకంగా ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 26 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష కొనసాగించిన ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఎట్టకేలకు దీక్షను విరమించారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై ఎలాంటి న్యాయపరమైన చర్యలు తీసుకోమని, పేపర్ లీక్ కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించడంతో ఆయన జ్యూస్ తాగి దీక్షను ముగించారు. జూన్ 28వ తేదీన ప్రారంభమై దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో ఎట్టకేలకు ముగిసింది. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్, లడఖ్ ఆపెక్స్ బాడీ సీనియర్ (మిగతా 2లో...)

# చదువుల తల్లి... కార్పొ'రేట్' బందీ

కొండపర్తి కిరణ్
(పీపుల్స్‌డైరీ-ప్రధాన ప్రతినిధి)

- అక్షరాలతో అక్రమ వ్యాపారం ■ అనుమతి ఒక్కటి... బ్రాంచీలు అనేకం
- నర్సరీ నుంచి ఇంటర్ వరకు విచ్చలవిడి యాపారం
- అకాడమీల పేరుతో మాయాజాలం ■ పర్మిషన్లు లేకుండానే లక్షల్లో దోపిడీ
- పుస్తకాలు, యూనిఫాంలు అంటూ అధిక ధరలతో వసూళ్ల పర్వం
- హాస్టల్ అంటూ లక్షల్లో గుంజుడే ■ రుచిపచి లేని భోజనాలతో విద్యార్థుల ఇబ్బందులు
- అధికారులు మాత్రం కన్నెత్తి చూడరు.. ■ విద్యాశాఖకు ఎంత ముట్టజెప్పుతున్నారో?

రుసుములు లక్షల్లో... సౌకర్యాలు అథమ స్థాయిలో... ప్రశ్నించే గొంతుకలపై నిర్బంధం! విద్యాబోధన సేవగా కాకుండా లాభాల పంట పండించే "అంగడి వ్యాపారం"గా మారిపోయింది. అనుమతులు ఒకచోట... నడిపేది అనేక చోట్ల... నర్సరీ పిల్లల నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడి బాగా పెరిగి పోయిందని తల్లి దండ్రులు ఇటు విద్యార్థి సంఘాలు ఎంత మొర పెట్టుకుంటున్నా విద్యా శాఖ అధికారుల చర్యలు మాత్రం శూన్యం గానే కనిపిస్తున్నాయి. ఈ దోపిడీల నుంచి బయట పడే మార్గాలే కానరాక పోతున్నాయి. అక్షరాలు నేర్పించాల్సిన సరస్వతీ నిలయాలు వ్యాపార సముదాయాలుగా మారిపోయాయి. నాణ్యమైన విద్యనందిస్తామని రంగురంగుల బ్రోచర్లు, ఆకర్షణీయమైన ప్రకటనలతో బురిడీ కొట్టిస్తూ తల్లిదండ్రుల జేబులకు పెద్ద ఎత్తున చిల్లులు పొడుస్తున్నాయి కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు.




**ఏ అనుమతులు ఒక్కచోట... బ్రాంచీలు వందల చోట్ల!**

ప్రభుత్వం నుంచి ఒక్క ప్రాంతంలో, ఒక పేరు మీద అనుమతి పొంది... అదే అనుమతి పత్రాలతో సిండికేట్‌గా ఏర్పడి నగరాలు, పట్టణాల్లో పదుల, వందల సంఖ్యలో అక్రమ బ్రాంచీలను నడిపిస్తున్నారు. విద్యాశాఖ నిబంధనలను కాగితాలకే పరిమితం చేస్తూ 'అకాడమీలు', 'టెక్నో', 'ఈ-టెక్నో' ల పేరుతో విచ్చలవిడిగా గొలుసుకట్టు వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

**ఐఐటీ, మెడికల్ పేరిట 'లక్షల' దోపిడీ**

నర్సరీ స్థాయి నుంచే 'ఐఐటీ సీట్ ఫౌండేషన్', 'ఒలింపియాడ్ అకాడమీ' అని మాయాజాలం చేస్తూ సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రుల బలహీనతలను సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల నిబంధనలను తుంగలో తొక్కి, ఎటువంటి అనుమతులు లేకుండానే లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు.

**పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరుతో అదనపు బాదుడు!**

పాఠశాల ఆవరణలోనే లేదా నిర్దేశిత దుకాణాల్లోనే పుస్తకాలు, యూనిఫామ్‌లు, షూ, టైలు కొనాలని విద్యార్థులను, తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నారు. బయట మార్కెట్ ధరలతో పోలిస్తే రెట్టింపు లేదా ముమ్మడి ధరలకు విక్రయిస్తూ దోపిడీ పర్వాన్ని కొనసాగిస్తున్నారు.

**నకిలీ ర్యాంకుల 'అమ్మకం'!**

ఇతర రాష్ట్రాల్లో లేదా ఎక్కడో దూర ప్రాంతాల బ్రాంచీలలో వచ్చిన ర్యాంకులను స్థానిక బ్రాంచీ పేరిట ప్రచారం చేసుకుంటూ విద్యార్థులను ఆకర్షిస్తున్నారు. "అక్కడి విద్యే ఇక్కడా ఇస్తాం" అంటూ అబద్ధపు ప్రకటనలతో చదువులను బహిరంగంగానే అమ్ముకుంటున్నారు.

**రుచి పచి లేని భోజనం... చెడిపోతున్న ఆరోగ్యాలు!**

హాస్టల్, మెస్ ఫీజుల పేరిట ఏడాదికి లక్షల రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యాలు, విద్యార్థులకు కనీస నాణ్యత లేని ఆహారాన్ని వడ్డిస్తున్నాయి. నాసిరకం బియ్యం, శుభ్రత లేని వంటశాలలతో రుచిపచి లేని తిండి పెడుతుండటంతో విద్యార్థులు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. కనీస గాలి, వెలుతురు లేని ఇరుకు గదుల్లో వందలాది మందిని ఉంచుతూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. లక్షలు ఖర్చుపెట్టిన కడుపునిండా తిండి తినలేకపోతున్నారు.

**కానరాని అధికారుల చర్యలు!**

ఈ అక్రమాలపై విద్యార్థి సంఘాలు, బాధితులు విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యంగా మారింది. ఆకస్మిక తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇకనైనా విద్యాశాఖ, ప్రభుత్వం స్పందించి అనుమతులు లేని అక్రమ బ్రాంచీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణకు చట్టబద్ధమైన చర్యలు చేపట్టాలని తల్లిదండ్రుల విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**తమిళనాడు తరహా విధానం అవసరం..**

పాఠశాలలకు ప్రభుత్వమే ఫీజు నిర్ణయించాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. తమిళనాడులో ప్రస్తుత నూతన సీఎం విద్యావ్యవస్థను ప్రక్షాళన చేస్తున్న విధంగానే రాష్ట్రంలో కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటే దోపిడీని అరికట్టే ఛాన్స్ ఉంటుంది.

# మూడో లైన్ పూర్తి

- రైలు ప్రయాణికులకు గుడ్‌న్యూస్..
- ఢిల్లీ సహా ఉత్తరాదికి వేగంగా ప్రయాణం
- కాజీపేట-బలార్షా రూట్‌లో పూర్తయిన పనులు

**పీపుల్స్‌డైరీ-కాజీపేట** : రైలు ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. ఢిల్లీపాటు ఉత్తరాది రాష్ట్రాలకు తెలంగాణ నుంచి రైలు ప్రయాణం చేసే లక్షలాది మంది ప్రయాణికులకు భారీ ఉపశమనం కలిగించే వార్తను అందించింది. దేశంలోని అత్యంత కీలకమైన కాజీపేట-బలార్షా గ్రాండ్ ట్రంక్ రూట్‌లో చేపట్టిన మూడో రైల్వే లైన్ నిర్మాణం, విద్యుదీకరణ పనులు పూర్తి అయినట్లు ప్రకటించింది. 203 కిలోమీటర్ల మేర ఉన్న ఈ మార్గంలో ట్రిప్లింగ్ పనులు పూర్తి కావడంతో.. ఈ రూట్‌లో రైళ్ల రాకపోకలు మరింత వేగవంతం కానుండగా.. ప్రస్తుతం ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉందని రైల్వే శాఖ వర్గాలు వెల్లడించాయి.

ఆసిఫాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య 11 కిలోమీటర్ల చివరి విడత మూడో లైన్ నిర్మాణం, విద్యుదీకరణ పనులతోపాటు.. బీబ్రా నదిపై నిర్మించిన కీలక వంతెన పూర్తి కావడంతో మొత్తం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ తాజాగా స్పష్టం చేశారు సుమారు రూ.3 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో తెలంగాణ పరిధిలో 159 కిలోమీటర్ల మేర ఉండగా.. మహారాష్ట్ర పరిధిలో 44 కిలోమీటర్ల పొడవునా ఈ మూడో రైల్వే లైన్‌ను నిర్మించారు.

దేశంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలిపే ఈ రైల్వే మార్గంలో ప్రయాణికులు మాత్రమే కాకుండా భారీగా సరకు రవాణా కూడా జరుగుతోంది. ప్యాసింజర్ రైళ్లతోపాటు.. బొగ్గు, సిమెంట్‌తో పాటు భారీ స్థాయిలో సరుకు రవాణా రైళ్లు పరుగులు తీస్తూ ఉంటాయి. అదే సమయంలో ఢిల్లీ, నాగ్‌పూర్, హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాలకు ప్రయాణించే రైళ్ల రద్దీ కూడా అధికంగా ఉంటుంది.

ఈ మార్గంలో కొత్తగా మూడో రైల్వే లైన్ అందుబాటులోకి రావడంతో రైళ్ల



రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణికుల రైళ్లు, సరుకు రైళ్ల నిర్వహణ మరింత సులభం కానుందని రైల్వే శాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. రైళ్ల వేగం పెరిగి.. దానివల్ల ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా.. సరుకు రవాణా కూడా వేగవంతమై పరిశ్రమలకు ప్రయోజనం చేకూరనుందని పేర్కొన్నాయి. విద్యుదీకరణ పూర్తికావడం వల్ల ఇంధన వ్యయం తగ్గి పర్యావరణానికి కూడా మేలు జరుగుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

# కందికి కొత్త రంది...

(మొదటి పేజీ తరువాయి)

అధ్యయనం ప్రకారం తెలంగాణలో ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు ఈ వైరస్ వ్యాప్తికి అత్యంత అనుకూలంగా ఉన్నట్లు తేలింది. చారిత్రక సమాచారం కూడా తెలంగాణలో ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా నమోదైనట్లు సూచిస్తోంది. భవిష్యత్తులో కూడా రాష్ట్రంలోని అధిక భాగం ప్రాంతాలు ఈ వైరస్ స్థిరపడేందుకు అనువుగా మారే అవకాశం ఉందని పరిశోధకులు పేర్కొన్నారు.

**దేశవ్యాప్తంగా విస్తరించే ప్రమాదం**

ఇప్పటి వరకు ప్రధానంగా దక్షిణ, మధ్య భారతదేశానికే పరిమితమైన ఈ 'గ్రీన్ ప్లేగు' గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో కొత్త ప్రాంతాలకు విస్తరించే ప్రమాదం ఉందని అధ్యయనం హెచ్చరించింది. 2070 నాటికి దేశవ్యాప్తంగా ఈ వ్యాధి వ్యాప్తికి అనుకూలమైన ప్రాంతాల విస్తీర్ణం దాదాపు 20 శాతం వరకు పెరగవచ్చని అంచనా వేసింది. దీంతో పంజాబ్, హర్యానా, రాజస్థాన్, పశ్చిమ మధ్యప్రదేశ్, ఉత్తర కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఈ వ్యాధి ముప్పు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

**ముందస్తు చర్యలే రక్షణ**

ఈ ముప్పును ఎదుర్కొనేందుకు తెలంగాణతో పాటు కొత్తగా ప్రమాద జాబితాలోకి వచ్చే ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ఇక్రిసాట్, ఐసీఏఆర్ పరిశోధక బృందాలు సూచించాయి. అలాగే నల్లి జాతి కీటకాన్ని నియంత్రించే చర్యలను విస్తృతంగా చేపట్టడం, వ్యాధిని తట్టుకునే కంది రకాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడం అత్యవసరమని పేర్కొన్నాయి.

## గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన పిసిఆర్ ఫౌండర్

**పీపుల్స్‌డైరీ-వరంగల్** : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్నని పిసిఆర్ ఫౌండర్ చైర్మన్ తోట పూర్ణ చందర్ రావు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పూల మొక్క అందించారు. ఈ సందర్భంగా నగరంలో పలు సమస్యలపై మాట్లాడుతూ వాటిని పరిష్కరించాలని కోరారు. కమిషన్ ను కలిసిన వారిలో గరేపెల్లి ప్రభాకర్, బూరుగుపల్లి శ్రీనివాస్, బీరవెల్లి సందీప్, బోళ్ల వెంకట్, ఉట్ల ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.



## 4వ బెటాలియన్‌లో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు



**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** మామూనూరు 4వ బెటాలియన్‌లో శుక్రవారం డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీసు మరియు అడిషనల్ డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీసు (బెటాలియన్స్) వారి ఉత్తర్వుల మేరకు వరంగల్ సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ అశోక్, సబ్ ఇన్స్పెక్టర్ చరణ్, పోలీసు హెడ్ కాన్స్టేబుల్ శ్రీను, కానిస్టేబుల్ జహుర్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం జరిగింది. నేటి సమాజంలో సైబర్ నేరాలు రోజురోజుకి పెరిపోతున్నాయని, వీటిపై ప్రజలకు సరియైన అవగాహన లేక సైబర్ మోసాల వల్ల ఆర్థికంగా, మానసికంగా బలైపోతున్నారు. ఈ సైబర్ మోసాలకు ముఖ్యంగా యువత, సాఫ్ట్ వేర్, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు గురి అవుతున్నారు. యువత ఆన్లైన్ గేమ్స్, ఆన్లైన్ బెట్టింగ్స్ కు బానిసలుగా మారి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వారు తక్షణమే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ జె.రాజేందర్ ఆర్ఐలు విజయ్,రవి,వెంకటేశ్వర్లు,రాజ్ కుమార్, అధికారులు మరియు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్‌ను కలిసిన జనసేన నాయకులు

**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎన్.శ్వేతను జనసేన పార్టీ నేతలు గాదె పృథ్వీ, డా.మాదం పద్మజదేవిలు కలిసారు. ఈ సందర్భంగా వారికి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారి మహిళ పోలీసు కమిషనర్‌గా రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో శాంతి భద్రత కాపాడేందుకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. త్వరలో పార్లమెంట్ స్థాయిలో జనసేన ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వారి దృష్టికి తీసుకెళ్లమని పేర్కొన్నారు.



# పదేళ్ల జైలు... పదికోట్ల జరిమానా

- పేపర్ లీక్‌లపై కఠిన చట్ట సవరణకు గ్రీన్‌సిగ్నల్
- మూడు నెలల్లో దర్యాప్తు పూర్తి
- ఇందుకోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు చట్టబద్ధ హోదా
- కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయాలు

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** పోటీ పరీక్షల్లో పేపర్ లీక్ ఘటనలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మరింత కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం మోపేలా చట్టాన్ని మరింత బలోపేతం చేసే సవరణలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే పేపర్ లీక్ కేసుల దర్యాప్తు, విచారణను తప్పనిసరిగా మూడు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులకు చట్టబద్ధ హోదా కల్పించనున్నారు. అలాగే వ్యవస్థీకృత పేపర్ లీక్ సిండికేట్‌లకు పాల్పడిన వారికి గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా నిబంధనలు తీసుకురానున్నారు.

కొత్త నిబంధనల ప్రధాన ఉద్దేశం రాష్ట్రాల మధ్య పనిచేస్తున్న పేపర్ లీక్ మాఫియాలను పూర్తిగా నిర్మూలించడం, ప్రభుత్వ పరీక్షలపై విద్యార్థుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడం. ప్రస్తుతం ఇలాంటి కేసులు సంవత్సరాల తరబడి కోర్టుల్లో కొనసాగుతుండగా, ఇకపై ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులు మూడు నెలల్లోనే దర్యాప్తు పూర్తి చేసి తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో నిందితులకు త్వరితగతిన శిక్ష పడటంతో పాటు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని కేంద్రం భావిస్తోంది.

నీట్ పరీక్షలో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన పేపర్ లీక్ ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. విద్యార్థుల నిరసనలు, ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే 2024లో తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టాన్ని మరింత కఠినతరం చేసే సవరణలను కేంద్రం సిద్ధం చేసింది.

## సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష విరమణ..

(మొదటి పేజీ తరువాయి)

నాయకులు, వైద్యులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆయన జ్యూస్ తాగి దీక్షను విరమించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున హామీ పత్రాన్ని చదివి వినిపించిన జేపీ నడ్డా.. జులై 20వ తేదీన పార్లమెంట్ మార్చ్‌తో పాటు జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపిన వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని స్పష్టం చేశారు. అలాగే నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబాలకు పరిహారం అందించే విషయాన్ని కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని చెప్పారు.

## మీదపడ్డ మృత్యువు....

(మొదటి పేజీ తరువాయి)

క్షణాల వ్యవధిలో వాహనం నుజ్జునుజ్జయ్యిపోయింది. ఈ వాహనంలో మొత్తం 15 మంది ప్రయాణిస్తున్నారు. ఉదయ్‌పూర్ నుంచి పాంగి ప్రాంతానికి వెళ్తుండగా కొండపై నుంచి ఉన్నట్టుండి భారీ రాళ్లు పడటంతో లోపల ఉన్నవారికి కనీసం బయటకు పరిగెత్తే అవకాశం కూడా దక్కలేదు. ఈ ప్రమాదంలో ఆరు నెలల చిన్నారితో సహా ఏకంగా 13 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. భారీ యంత్రాల సహాయంతో శిథిలాలను తొలగించి, మృతదేహాలను బయటకు తీశారు. ప్రమాదం నుంచి ఇద్దరు సురక్షితంగా బయటపడగా, తీవ్రంగా గాయపడిన ఒకరిని ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

## ఏపీ, తెలంగాణకు భారీ వర్షసూచన..


(మొదటి పేజీ తరువాయి)

అవకాశముంది. ఇక ఈరోజు, రేపు, ఎల్లుండి దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది. ఇక రాయలసీమలో రాబోయే మూడ్రోజుల పాటు వానలు పడతనున్నాయి. అటు రాగల 3 రోజుల్లో కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణము కంటే 2 -4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది.

## 25న ఓ సిటీలో శ్రీ బీరన్నస్వామి బోనాల పండుగ




**వరంగల్ జూలై 24 (పీపుల్స్‌డైరీ) :** వరంగల్ నగరంలోని "ఓ" సిటీలో గల శ్రీ వీరన్న స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా కురుమలకు ఇలవేల్పు అయిన భీరన్న స్వామికి తొలి బోనం సమర్పించనున్నందున ఓసిటీ కురుమ మహిళలు ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు అధ్యక్షుడు కంచ సంపత్ (ఎల్ఈపి ) ప్రధాన కార్యదర్శి కంచ సంపత్ (జీకే ) తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కంచ సారయ్య, అల్లే రాంమూర్తి, దయ్యాల ప్రభాకర్, అధ్యక్షులు కంచ సంపత్, ఉపాధ్యక్షులు గౌడ నర్సింగం అల్లే సంపత్, ప్రధాన కార్యదర్శి కంచ సంపత్ సహాయ కార్యదర్శులు కంచ రఘుపతి కోశాధికారి సవాయి శ్రీనివాస్ (వంశీ ఆగ్రో)కార్యవర్గ సభ్యులు కంచ రవి (పెద్ద మనిషి) కంచ శ్రీనివాస్ గౌడ అశోక్ గోవిందు కుమారస్వామి కొమ్ము రమేష్ ముఖ్య సలహాదారులు గౌడ మల్లేశం కొంగంటి సుధాకర్ కోరె రవి.రాస భిక్షపతి పూజారులు బండారి మొగిళి నరిగే రాజు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల సమస్యల పేరుతో రాజకీయాలు వద్దు

**నీట్‌పై కాంగ్రెస్, వామపక్షాల తీరును ఖండించిన బీజేపీ**



**హసన్‌పర్తి, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** నీట్ పరీక్ష అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ కాంగ్రెస్ పార్టీ, వామపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ హసన్‌పర్తి మండల శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షులు మారం తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష అంశాన్ని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్, వామపక్ష పార్టీలు విద్యార్థులను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వద్ద ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించడం చూస్తుంటే, ఈ ఆందోళనలు విద్యార్థుల కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసమే జరుగుతున్నాయని అన్నారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ దేశ ప్రయోజనాలు, విద్యార్థుల సంక్షేమం కోసం కట్టుబడి ఉంటుందని ఆయన తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్మాణాత్మక సూచనలు చేయాల్సిందిపోయి, నీట్ అంశాన్ని రాజకీయాలకు వేదికగా మార్చడం తగదన్నారు. కాంగ్రెస్ పాలనలోనూ అనేక ప్రశ్నపత్రాల లీకేజీలు జరిగినప్పటికీ, అప్పట్లో బాధ్యత వహించి ఎవరైనా రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనల్లో నీట్‌కు సంబంధం లేని రాజకీయ అంశాలను ప్రస్తావించడం ద్వారా వాటి అసలు ఉద్దేశం రాజకీయ లబ్ధేనని స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి చెల్పూరి శంకర్, ఉపాధ్యక్షులు బలగాని రవీందర్, తోకల రఘుపాల్ రెడ్డి, కార్యదర్శులు దాది మధుసూదన్, ఒజ్జ కుమార్, దాట్ల సునీల్, బీజేపీ నాయకులు దాసరి రాజు, గుర్రాల చంద్రమౌళి, తాళ్ల రవేష్, తాళ్ల శ్యామ్, జీల సురేష్ యాదవ్, పెద్దమ్మ నాగరాజు, పెద్దమ్మ శ్రీనివాస్, మట్టెడ సుమన్, ఆర్మీ శ్రీనివాస్, శ్రావణపెల్లి రవీంద్రాచారి, మోడెం రమేష్, పట్టాభి, ఇమ్మడి కరుణాకర్, యటకల రమేష్, పెద్దమ్మ కుమారస్వామి, ఎస్.టి. రాజు, చొక్కం మహేందర్, జనగాం రవి, బుర్ర రాజేష్, నాతి శివ, బుర్ర రాజ్‌కుమార్, కుంబర్కర్ సాయి, శ్యామ్‌తో పాటు వివిధ పదాధికారులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కారేపల్లిలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- **ముఖ్య అతిథిగా పాల్గొన్న వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్**



**సింగరేణి(కారేపల్లి) జూలై 24: (పీపుల్స్ డైరీ):** సింగరేణి మండలం కారేపల్లిలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మదన్ లాల్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బానోత్ మనీషా మదన్ లాల్ మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధిలో కేటీఆర్ అందించిన సేవలు విశేషమని, యువతకు స్ఫూర్తినిచ్చే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని, ఆయురా రోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం నాయకులు మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేస్తారని, పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డొంకిన రవీందర్, తాత ఎంకన్న, మాజీ సర్పంచ్‌లు బన్సీలాల్, మోహన్, సమ్మయ్య, గంగారబోయిన సత్యం, స్వామి, యుగంధర్, శ్రీకాంత్, ఉద్యమకారుడు సోమందుల నాగరాజు, యువజన నాయకులు ఆదేర్ల నాగి, గంగారబోయిన మురళి, సంపత్, వికాస్, సన్నీ తదితరులు పాల్గొని కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- **కారేపల్లిలో విజయవంతంగా బంద్ నిర్వహణ**
- **నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: పి వై ఎల్ తెలంగాణ రాష్ట్ర నాయకులు శివ నాయక్**




**సింగరేణి (కారేపల్లి) జూలై 24 (పీపుల్స్ డైరీ):** కారేపల్లి, ఖమ్మం జిల్లా: నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పిలుపునిచ్చిన దేశవ్యాప్త బంద్ లో భాగంగా కారేపల్లి మండల కేంద్రంలో బంద్ విజయవంతంగ నిర్వహించినట్లు పి వై ఎల్ తెలంగాణ రాష్ట్ర నాయకులు శివ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ ఘటన దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చిందన్నారు. ఇలాంటి తీవ్రమైన వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత స్వీకరించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజీనామా కోరుతూ దేశవ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగ యువతపై లాఠీచార్జీ చేయడం, బాష్పవాయు గోళాలు ప్రయోగించడం ప్రజాస్వామ్య విలువలకు మాయని మచ్చ అని ఆయన విమర్శించారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం పోలీసు బలగాలతో అణచివేతకు పాల్పడటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో రాజ్యాంగాన్ని చేతబట్టి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటంతో శాంతియు తంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థులు, యువతపై లాఠీచార్జీ చేయడం ప్రజాస్వామ్య దేశానికి తగిన చర్య కాదన్నారు. శాంతియుత నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును హరించే చర్యలు సమర్థనీయం కాదని అన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ పెరుగుతోందని, ఉద్యోగాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని శివ నాయక్ ఆరోపించారు. ప్రతి సంవత్సరం కోటి ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ ఏమైందో ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెద్ద కార్పొరేట్ సంస్థలపై చూపుతున్న శ్రద్ధను విద్యార్థులు, యువత, నిరుద్యోగుల సమస్యల పరిష్కారంపై చూపడం లేదని విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేసి, విద్యార్థులు మరియు నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే గతంలో రైతాంగం సాగించిన చారిత్రాత్మక ఉద్యమాల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతను సమీకరించి భారీ స్థాయిలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ విద్యార్థి నాయకులు నెహ్రూ, గౌతమ్, నవీన్, వినయ్, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో యూఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం




**మేడ్చల్, జూలై 24(పీపుల్స్ డైరీ):-** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్య, ఉపాధి హక్కుల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్‌కు నిరసనగా యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మేడ్చల్ నియోజకవర్గంలో శుక్రవారం కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భం గా యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ నియోజకవర్గ కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు దాడి చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. విద్యారంగ ప్రైవేటీకరణ, పెరుగుతున్న ఫీజులు, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ, విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం దేశ రాజధానిలో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, లాఠీచార్జ్‌కు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, విద్య–ఉపాధి సమస్యలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభిం చాలని, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ లోని పాఠశాలలు, కళాశాలల ముందు నిరసన కార్యక్రమాలు నిర్వహించి బంద్‌ను విజయవంతం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్, ప్రసాద్, చిరు, టింకు, నందీష్, అజిత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అత్వెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా మాదిరి ఎన్నికలు



మేడ్చల్ జూలై 24 (పీపుల్స్ డైరీ):- మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలను పెంపొందించే లక్ష్యంతో మాదిరి ఎన్నికలను ఘనంగా నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి, ఎన్నికల నియమావళిని ప్రకటించిన అనంతరం ఉదయం నుంచి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించి విద్యార్థి నాయకులను ఎన్నుకున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం హెడ్ బాయ్‌గా ప్రవీణ్, హెడ్ గర్ల్‌గా నందిని, డిప్యూటీ హెడ్ బాయ్‌గా హర్ష సిద్ధార్థ, డిప్యూటీ హెడ్ గర్ల్‌గా ప్రయాణం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి పాఠశాల దత్తత అధ్యక్షులు నాగిరెడ్డి నల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు గడప నవీన్, రాంబాబు, పద్మలత, వసీం, మంజుల, రితుబాసిన్, ప్రభాకర్, రంగారావు, విజయలక్ష్మి, సోనీ తదితరులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ



**మేడ్చల్ జూలై 24(పీపుల్స్ డైరీ):-** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ మేడ్చల్ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందువులకు అత్యంత పవిత్రమైన తొలి ఏకాదశి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. శ్రీ మహా విష్ణువు కటాక్షంతో తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ, ముఖ్యంగా మేడ్చల్ ప్రజలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. అలాగే తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు మరియు ప్రజలందరికీ తొలి ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# సర్ కార్యక్రమాన్ని సమీక్షించిన రేగు రాజు



**మేడ్చల్ జూలై 24(పీపుల్స్ డైరీ):-** ప్రత్యేక సమన్విత పునర్విచారణ (సర్) కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు, పుడూర్–కిస్టాపూర్ డివిజన్ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్‌తో కలిసి 298వ డివిజన్ పరిధిలోని వివిధ పోలింగ్ బూత్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న సర్ కార్యక్రమాన్ని సమీక్షించిన వారు, పార్టీ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులతో సమావేశమై కార్యక్రమం క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఓటరు జాబితా పునర్విచారణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ కౌన్సిలర్ దేవా, కృష్ణ యాదవ్, సతీ రెడ్డి, సురేష్ గౌడ్, శేఖర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు పండ్ల పంపిణ

**కేటీఆర్ 50వ జన్మదినం సందర్భంగా క్యాన్సర్ రోగులకు పండ్ల పంపిణీ మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్**



**మేడ్చల్, జూలై 24 (పీపుల్స్ డైరీ):-** భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని మేడ్చల్‌లో బీఆర్ఎస్ నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ ఆధ్వర్యంలో దేవరయంజాల్‌లోని ప్రత్యక్ష పాలియేటివ్ కేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న క్యాన్సర్ రోగులకు పండ్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం తుడుం గణేష్ మాట్లాడుతూ, కేటీఆర్ తెలంగాణ అభివృద్ధికి విశేష కృషి చేసిన నాయకుడని, ఐటీ రంగం, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, యువత ఉపాధి అవకాశాల కల్పనలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కేటీఆర్‌కు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబు యాదవ్, మాజీ వార్డు సభ్యుడు శశికుమార్, నాగరాజు ముదిరాజ్, నరేష్ కుమార్, బాలేష్ యాదవ్, నరసింహాతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమగ్ర ఓటరు జాబితా ప్రక్షాళనకు మద్దతుగా బీజేపీ తీర్మానం



**మేడ్చల్ జూలై 24 (పీపుల్స్ డైరీ):-** భారతీయ జనతా పార్టీ మేడ్చల్–కిష్టాపూర్ ఉమ్మడి డివిజన్ల కార్యవర్గ సమావేశంలో సమగ్ర ఓటరు జాబితా ప్రక్షాళన ఎస్ఐఆర్ అంశంపై ప్రవేశపెట్టిన తీర్మానానికి బీజేపీ మేడ్చల్ డివిజన్ ఉపాధ్యక్షులు మైసరి రాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటరు జాబితా ప్రక్షాళన అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. దేశ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవడం అవసరమని అన్నారు. అలాగే, ఈ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని ఆయన విమర్శించారు. ఇటీవల మేడ్చల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేసిన ఘటనను ప్రస్తావిస్తూ, అలాంటి చర్యలు రాజకీయ విమర్శలకే పరిమితమని, దేశ ప్రజల గుండెల్లో ప్రధాని మోదీకి ప్రత్యేక స్థానం ఉందని వ్యాఖ్యానించారు.

# నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

- విద్యార్థులపై లాఠీచార్జిని ఖండిస్తూ సింగరేణి మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

**సింగరేణి (కారేపల్లి) జులై 24 (పీపుల్స్ డైరీ):** విద్యార్థుల భవిష్యత్తుతోచెలగాటమాడుతున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులపై పోలీసులు జరిపిన లాఠీచార్జిని తీవ్రంగా ఖండిస్తూ సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సింగరేణి మండల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్, నిరసన ప్రదర్శన శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం సింగరేణి మండల కార్యదర్శి కే. నరేంద్ర అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, డీవైఎఫ్ఐ సింగరేణి మండల కార్యదర్శి




వినయ్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పృథ్వీ మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాల కారణంగా మనస్థాపానికి గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండించారు. అలాగే, ఢిల్లీలో శాంతియు తంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువత, నిరుద్యోగులపై లాఠీచార్జి చేయడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నవీన్, వెంకీ, సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొప్పుల వెంకటేష్ మీద దాడి చేసిన బీజేపీ నేతలపై టిఆర్పీ ఫైర్

- దాడులతో టీఆర్పీని భయపెట్టలేరు, ప్రజల కోసం పోరాటం ఆపేది లేదు
- ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే దాడులా? బీజేపీ నేతల తీరుపై టీఆర్పీ ఆగ్రహం...
- దాడికి యత్నించిన బీజేపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలి...
- గంగాధర పోలీస్ స్టేషన్‌లో టీఆర్పీ నేతల ఫిర్యాదు...
- టీఆర్పీ శ్రేణులపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించిన రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా..

**కరీంనగర్ జులై 24 పీపుల్స్ డైరీ :** గంగాధర: తెలంగాణ రాజకీయాధికార పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ కొప్పుల వెంకటేష్‌పై నిన్న రాత్రి బీజేపీ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షుడు షేక్ చాన్ పాషాతో పాటు చొప్పదండి నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలిసి గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేసారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజకీయ భిన్నాభిప్రాయాలు సహజమని, అయితే రాజకీయ విభేదాలను వ్యక్తిగత దాడులకు, భౌతిక దాడులకు దారితీయడం ఏమాత్రం సహించబోమని అన్నారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్న టీఆర్పీ నాయకులపై దాడులు చేయడం ద్వారా తమ గొంతును అణచివేయలేరని స్పష్టం చేశారు. మహేష్ గాడ్సే లాంటి వారు కొంతమంది యూట్యూబ్ ఛానల్ యాంకర్లు యూట్యూబ్ వేదికగా పనిగట్టుకొని టిఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై దుర్భాషలాడడం సరికాదని, అలాంటి చిల్లర గాళ్లకు కేంద్రమంత్రి బండి సంజయ్ సపోర్ట్ చేయడం వారి కార్యాలయాల ప్రారంభోత్సవాలకు వెళ్లడం సిగ్గుచేటని మా నాయకుడు వెంకటేష్ ప్రశ్నించిన తీరులో తప్పేముందని అన్నారు. చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ కొప్పుల వెంకటేష్‌పై జరిగిన దాడిని టీఆర్పీ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, దాడికి పాల్పడిన వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకు లందరూ ప్రజాస్వామ్య విలువలను గౌరవించి,



శాంతి యుత వాతావరణంలో రాజకీయాలు చేయాలని ఆయన సూచించారు. చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ కొప్పుల వెంకటేష్ మాట్లాడుతూ.. తనపై జరిగిన దాడి పిరికిపంద చర్య అని, ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయాలను ఎదుర్కోలేకనే కొందరు దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. తాను ప్రజల తరఫున ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై పోరాడటం ఆపేది లేదని స్పష్టం చేశారు. తనపై దాడి చేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ సందర్భంగా గంగాధర మండల అధ్యక్షుడు ముక్కెర గంగరాజు, యూత్ ప్రధాన కార్యదర్శి బండ గంగరాజు, శ్యామల అజయ్ కోడిమ్యాల మండల అధ్యక్షుడు దుబ్బాక అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు
- కొత్త బొగ్గు బ్లాకుల సాధనకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలి
- రాష్ట్ర విద్యుత్ రంగానికి సింగరేణి వెన్నెముక...
- సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం

**మణుగూరు జులై 24 (పీపుల్స్ డైరీ ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించి విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలను పరిశీలించిన అనంతరం, మణుగూరు ప్రకాశ్ ఖని (పీకే ఓసీ) ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనిని క్షేత్రస్థాయిలో సందర్శించి గని పనితీరు, బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, సంస్థ భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ పర్యటనలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, జిల్లా కలెక్టర్ అంకిత్, ఇల్లందు శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, ఎస్‌సీసీఎల్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, ఐఏఎస్, టీఎస్‌జెన్‌కో ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ హరీష్, ఐఏఎస్, ఎస్‌సీసీఎల్ డైరెక్టర్ (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ & వెల్ఫేర్) గౌతమ్ పొట్రూ తదితరులు



పాల్గొన్నారు. ముందుగా భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, బొగ్గు వినియోగం, యంత్రాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ వ్యవస్థలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెంట్రల్ కంట్రోల్ యూనిట్‌ను సందర్శించి విద్యుత్ ఉత్పత్తి, నియంత్రణ వ్యవస్థల పనితీరును పరిశీలించారు. ప్లాంట్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు చేపడుతున్న చర్యలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నిర్వహణలో అనుసరిస్తున్న విధానాలపై అధికారులతో చర్చించారు. అనంతరం భద్రాద్రి పవర్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డి.ఏ.వి. పాఠశాలను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించే దిశగా చేపట్టిన చర్యలను అభినంది ంచారు. రాష్ట్ర విద్యుత్ రంగానికి సింగరేణి వెన్నెముకలాంటి సంస్థ అని పేర్కొంటూ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు నిల్వల పెంపు, ఉత్పత్తి విస్తరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారు లకు సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, తాడిచెర్ల బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించడంతో సంస్థ వ్యాప్తంగా అధికారులు, ఉద్యోగులు, కార్మికుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అదేవిధంగా, సంస్థ భవిష్యత్ ఉత్పత్తి అవసరాలు, దీర్ఘకాలిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయి ంచేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, సింగరేణి ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. సంస్థ అభివృద్ధి, విస్తరణ, కొత్త బొగ్గు బ్లాకుల సాధన, ఉద్యోగుల సంక్షేమం, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు వంటి అన్ని అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి, టీఎస్‌జెన్‌కో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ఆందోళనలు

బీజేపీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్



**భీమదేవరపల్లి జూలై 23 (పీపుల్స్ డైరీ ) :** పార్లమెంట్‌లో ప్రశ్నోత్తరాల సమయంలో నిద్రించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బయట ప్రజా సమస్యల పేరుతో నిరసనలు చేపట్టడం విడ్డూరంగా ఉందని బీజేపీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్ విమర్శించారు. భీమదేవరపల్లిలో కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆయన ఆరోపించారు. పరీక్షల ప్రక్రియ ముగిసి నెలలు గడిచిన తర్వాత ఆ అంశాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావడం వెనుక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశమే ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లోనే వాటిని ప్రస్తావించి పోరాడాలని, సభలో బాధ్యత విస్మరించి బయట నిరసనలకు దిగడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించి రాజకీయ లబ్ధి పొందడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. తెలంగాణ ఉద్యమం గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం హాస్యాస్పదమని, ఉద్యమ చరిత్రను ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు. దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ హయాంలో అవినీతి, కుంభకోణాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఇప్పుడు అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యమని, వాస్తవాలను ప్రజలు గుర్తించి తగిన సమయంలో సరైన తీర్పు ఇస్తారని పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్ పేర్కొన్నారు.

# గచ్చిబౌలిలో ఎల్లంపేట మున్సిపాలిటీ కౌన్సిలర్లకు శిక్షణ



**మేడ్చల్ జూలై 24 (పీపుల్స్ డైరీ):-** గచ్చిబౌలిలో గురువారం ఎల్లంపేట మున్సిపాలిటీ కౌన్సిలర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పాలన, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం, అభివృద్ధి పనుల సమర్థవంతమైన అమలు, పారదర్శక పరిపాలనతో పాటు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విధానాలపై అధికారులు అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న కౌన్సిలర్లు స్థానిక సమస్యలను సమర్థంగా పరిష్కరించే విధానాలు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలతో సమన్వయం, సేవల నాణ్యతను మెరుగుపరిచే అంశాలపై పలు సూచనలు, సలహాలు స్వీకరించారు. ప్రజా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని పాల్గొన్న కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపాలిటీ 24వ వార్డు కౌన్సిలర్ అర్చన శ్రీనివాస్తో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# నూతన సీఐ అంజి రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**మేడ్చల్, జూలై 24(పీపుల్స్ డైరీ):** మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన అంజి రెడ్డిని గుండ్లపోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి 299 డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముదిరాజ్, 299 డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్, బండారి అనిల్, లేబర్ సెల్ అధ్యక్షులు కావాలి భాస్కర్, ఒడ్డె ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నూతన బాధ్యతల్లో సీఐ అంజి రెడ్డి విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందిస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో విశేష కృషి చేయాలని అభినందనలు తెలియజేశారు.

# మేడ్చల్ డివిజన్ ప్రజలకు తొలి ఏకాదశి శుభాకాంక్షలు రాఘవేందర్ గౌడ్



**మేడ్చల్ జూలై 24 (పీపుల్స్ డైరీ):-** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరిం చుకుని మేడ్చల్ డివిజన్ ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మేడ్చల్ డివిజన్ ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులు, పురప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రజలందరికీ తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

# ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్

జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ డి ఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ (సార్ ) సమీక్ష సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ , మున్సిపల్ కమిషనర్



**జమ్మికుంట జులై 24పీపుల్స్ డైరీ :** ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ప్రతి అర్హుడైన ఓటరుకు అవకాశం కల్పించేలా స్థానిక కౌన్సిలర్స్, బీఎల్ఓలు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆర్డీఓ సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ మా మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో జమ్మికుంట పట్టణ పరిధిలోని 30 వార్డుల కౌన్సిలర్స్ బీఎల్ఓలతో కలిసి గ్రౌండ్ లెవెల్‌లో ప్రతి ఓటరును గుర్తించి, ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితాలో మిస్ కాకుండా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వంద శాతం విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, ఎం ఆర్ ఓ, గౌరవ కౌన్సిలర్స్ సంబంధిత అధికారులు,బి ఎల్ ఓ లు తదితరులు పాల్గొన్నారు..

పీపుల్స్ డైరీ
వరంగల్
శనివారం, 25 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 135


# రోడ్డు విస్తరణలో బాధితులకు న్యాయం చేయాలి...

- అధికారులు స్పందించాలని వినతిపత్రం సమర్పణ..
- 33 అడుగుల మార్కింగ్‌కే పరిమితం చేయాలి..
- స్థలాలు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్...



**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 24 :** హుస్నాబాద్–కొత్తపల్లి నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో వివాదాస్పదంగా మారాయి. రహదారి విస్తరణ కారణంగా పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అనేక ఇళ్లు, ప్రహరీ గోడలు, ఖాళీ స్థలాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా రహదారి పక్కనే నివాసముంటున్న తమ ఒక్క గూడు కళ్లముందే కూలిపోతుంటే తట్టుకోలేని పరిస్థితి నెలకొందని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో రహదారి సెంటర్ పాయింట్ నుంచి 33 అడుగుల వరకు మాత్రమే స్థల సేకరణ జరుగుతుందని మార్కింగ్ చేసిన అధికారులు, ప్రస్తుతం 40 అడుగుల వరకు రోడ్డు విస్తరణ చేపడుతున్నారని ఆరోపించారు. ఈ మార్పు ఎందుకు జరిగిందో స్పష్టత ఇవ్వాలని, ముందుగా ఇచ్చిన మార్కింగ్ ప్రకారమే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకుని రహదారి విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న కుటుంబాలకు ప్రభుత్వం తరఫున తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అధికారులు ప్రహరీ గోడలు కూల్చివేయడం, స్థానికులతో చర్చించకుండా పనులు ప్రారంభించడం సరైన విధానం కాదని బాధితులు విమర్శించారు. మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తే ఆర్ అండ్ బీ శాఖను చూపిస్తు న్నారని, ఆర్ అండ్ బీ అధికారులు మున్సిపాలిటీని చూపిస్తున్నారని, దీంతో బాధితులు అయోమయంలో పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై అధికా రులు వెంటనే స్పందించి బాధితులతో చర్చలు జరిపి న్యాయం చేయాలని, రహదారి విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న కుటుంబాలకు తగిన నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. బాధితులకు మద్దతుగా బీఆర్ఎస్, సీపీఐ, బీఎస్పీ నాయకులు సంఘీభావం ప్రకటిస్తూ వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ వినతిపత్రం సమర్పించిన బాధితులు రాజ్‌కుమార్, వెంకట్ రెడ్డి, సీహెచ్. విమల, రాజిరెడ్డి, రాజశేఖర్, చాడ శ్రీధర్ రెడ్డి, కోవి నాగేశ్వర్ రావు, విజయ్ కుమార్, గంధం సుధాకర్ రెడ్డి, సూరంపల్లి ధనుంజయ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మి, కొండూరు శ్రీకాంత్, కొయ్యడ బంటి, ప్రతాప్, చంద్రయ్య, కొత్తపల్లి అంజయ్య, గడ్డం సంపత్, కవ్వ రాఘవరెడ్డి తదితరులతో పాటుమద్దతుగా పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, బత్తుల జగ్జీవన్, తిరుపతి నాయక్, సీపీఐ నాయకులు జనగాం రాజ్‌కుమార్, గూడ పద్మ, బీఎస్పీ నాయకుడు రాజు, జంగా విజయతో పాటు ఇతర నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

# వైద్య విధాన పరిషత్‌కు రెగ్యులర్ కమిషనర్ ఎప్పుడు..?

- హుస్నాబాద్‌లో మొక్కలు నాటి వైద్య సిబ్బంది వినూత్న నిరసన
- రెండు నెలలుగా పెండింగ్‌లో ఉద్యోగుల సమస్యలు..
- వెంటనే నియామకం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ):** జూలై 24 రాష్ట్ర ప్రభుత్వ వైద్య సేవల్లో కీలక భూమిక పోషిస్తున్న వైద్య విధాన పరిషత్‌లో రెగ్యులర్ కమిషనర్‌ను వెంటనే నియమించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం వైద్యాధికారులు, ఉద్యోగులు వినూత్న నిరసన చేపట్టారు. వైద్య విధాన పరిషత్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) రాష్ట్ర పిలుపు మేరకు "మొక్కలు నాటుదాం.. మనవి చేద్దాం" కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి ప్రభుత్వానికి తమ ఆవేదనను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "రెండు నెలలుగా మా సమస్యలను వినిపించుకునే అవకాశం లేదు.. ఆత్మగౌరవంతో వాటిని పరిష్కరించుకునే పరిస్థితి కూడా లేదు" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 185 వివిధ స్థాయిల ఆసుపత్రులు, 4 వేల మందికి పైగా సిబ్బందితో ప్రభుత్వ వైద్య సేవల్లో కీలకంగా పనిచేస్తున్న వైద్య విధాన పరిషత్ త్వరలో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మారనున్న నేపథ్యంలో కమిషనర్ పదవి రెండు నెలలుగా ఖాళీగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో ఆసుపత్రుల పనితీరుపై పర్యవేక్షణ తగ్గిపోవడమే కాకుండా వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, మినిస్టీరియల్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వ్యక్తిగత, సర్వీస్ సంబంధిత సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు. పలుమార్లు ప్రభుత్వానికి విన తిపత్రాలు సమర్పించినా స్పందన లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టాల్సి వచ్చిందన్నారు. "పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంత అవసరమో.. మా సమస్యల పరిష్కారానికి రెగ్యులర్ కమిషనర్ నియామకం అంతే అవసరం" అనే సందేశంతో మొక్కలు నాటామని తెలిపారు. అత్యవసర వైద్య సేవలు అందించే శాఖలో పనిచేస్తున్నందున ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఆందోళనలు చేయకుండా, బాధ్యతాయు తంగా ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ కమిషనర్‌ను నియమించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి. రమేష్ రెడ్డి, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రమాదేవి, టీఎచ్ఎంఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. నర్సింహులు, హెడ్ నర్స్ భారతితో పాటు వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, మినిస్టీరియల్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎన్‌ఎస్ యు ఐ,యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం


- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి:
- కాంగ్రెస్ నాయకుల డిమాండ్




**భీమదేవరపల్లి జూలై 23 (పీపుల్స్ డైరీ ) :** దేశంలో నీట్ పేపర్ లీక్ ఘటనను నిరసిస్తూ ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన అమానుష లాఠీచార్జీకి వ్యతిరేకంగా, అలాగే ఈ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ఎన్‌ఎస్ యు ఐ పిలుపు మేరకు భీమదేవరపల్లి మండలవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. ఎన్ ఎస్ యూ ఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు మండలంలోని అన్ని గ్రామాలలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను తిరుగుతూ యాజమాన్యాల సహకారంతో బంద్‌ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు మాట్లాడుతూ... "దేశ రాజధానిలో విద్యార్థులపై జరిపిన లాఠీచార్జ్ అత్యంత దారుణం. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం దేశ విద్యా వ్యవస్థను, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోంది. లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ విద్యార్థుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా సాగిస్తున్న పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని, విద్యార్థుల పక్షాన మేము నిరంతరం నిలబడతాం. కేంద్ర విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేసేంత వరకు, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదని తెలిపారు. ఈ కార్యక్రమ ంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు ఆదరి మహేందర్ యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకులు చిట్కూరి అనిల్, గుడిగందుల రాజు, ఆదరి రాజేందర్ యాదవ్,గిరబోయిన అఖిల్ యాదవ్, చిట్కూరి నితిన్, తాళ్ల అరవింద్ గౌడ్, మర్రి దేవరాజు, వేణు, నిఖిల్, తాళ్లపల్లి ప్రవీణ్, తాళ్ల అరవింద్, చిట్టంపల్లి స్వామి, లడ్డ, కూకట్ల కౌశిక్ యాదవ్,పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# తాత ఆశయాలను కొనసాగిస్తా.. ప్రజలకు మరింత సేవ చేస్తా: వొడితల ప్రణవ్

- వొడితల రాజేశ్వర్‌రావు వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు
- సైదాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



**హుజురాబాద్, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** రాజ్యసభ సభ్యుడిగా, ప్రజా ప్రతినిధిగా విశిష్ట సేవలందించిన దివంగత వొడితల రాజేశ్వర్‌రావు ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు మరింత సేవ చేస్తానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం వొడితల రాజేశ్వర్‌రావు వర్ధంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి వొడితల ప్రణవ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో రాజేశ్వర్‌రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

### రాజకీయాల్లో విశిష్ట సేవలు

ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ, దేశ రాజకీయాల్లో క్లిష్ట పరిస్థితుల్లో అప్పటి ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు ప్రభుత్వాన్ని నిలబెట్టడంలో రాజ్యసభ సభ్యుడిగా వొడితల రాజేశ్వర్‌రావు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన మహానుభావుడని పేర్కొన్నారు.

### విద్యాభివృద్ధికి విశేష కృషి

నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో విద్యాసంస్థలను స్థాపించి ఉచిత విద్యకు ప్రాధాన్యం కల్పించారని తెలిపారు. హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఇప్పటికీ ఆయన అభివృద్ధి ఆనవాళ్లు ప్రజలకు కనిపిస్తున్నాయని అన్నారు.

### భారీగా పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, వైస్ చైర్మన్ అంజలి, కౌన్సిలర్లు, దేవాలయాల చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, మండల, పట్టణ అధ్యక్షులు, సర్పంచులు, వార్డు సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్, బీసీ, ఎస్సీ, యువజన, సేవాదళ్, సోషల్ మీడియా, యూత్ కాంగ్రెస్, మైనారిటీ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

**క్రీ.శే. గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**



**హుజురాబాద్, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు క్రీ.శే. గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి శ్రీ రొంటాల సుహాసిని మనోజ్ రావు, ట్రస్ట్ వ్యవస్థాపకులు గంగిశెట్టి జగదీశ్వర్ పాల్గొని పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని కొనియాడారు. సమాజ సేవలో భాగంగా ట్రస్ట్ చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# శంకరపట్నం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన ర్యాలీ




**శంకరపట్నం జూలై : 24 పీపుల్స్ డైరీ :** మండలం లోని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం రోజున కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ల అరెస్టులను నిరసిస్తూ నిరసన ర్యాలీ చేశారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహం నుండి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్లు గోపగోని బసవయ్యగౌడ్, గాజుల మహేష్, కీసర సంపత్, మార్కెట్ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, మత్స్యగిరీంద్ర స్వామి దేవస్థానం చైర్మన్ రాజిరెడ్డి, శంకరపట్నం ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు గొట్టే మధు, మత్స్యగిరీంద్ర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, సర్పంచ్‌లు పద్మ, రవి, సీనియర్ నాయకులు గట్టు తిరుపతి, కవ్వ పద్మ, తాటికొండ సదానంద చారి, హిసామొద్దీన్, రాజయ్య, సదానందం, , చంద్రమౌళి, అజయ్, దేవునూరి కిష్టయ్య, నూనె శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ లీకేజీ, విద్యార్థులపై లాఠీచార్జిని ఖండించిన బిఆర్ఎస్, బీఎస్పీ నాయకులు

**హుస్నాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతి...**



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 24 :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్, బీఎస్పీ నాయకుల ఆధ్వర్యం లో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శుక్రవారం ధర్నా నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నీట్ –2026 పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. లాఠీచార్జికి బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, మృతి చెందిన వారి కుటుంబాలకు తగిన ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఐలేని మల్లికార్జున్ రెడ్డి, చిత్తారి శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, రవీందర్ రెడ్డి, గుగులోత్ తిరుపతి, బీఎస్పీ నాయకులు వేల్పుల రాజు, మారేపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్,పూడూరు - కిస్టాపూర్ డివిజన్ బీజేపీ పార్టీ కార్యవర్గ సమావేశం

**మేడ్చల్ జూలై 24 (పీపుల్స్ డైరీ):** మేడ్చల్ ఉమ్మడి డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ మేడ్చల్లో అస్తవస్తమైన రోడ్లు,డ్రైనేజ్ వ్యవస్థ,ఎ సమస్య కూడా పరిష్కారం కావడం లేదని ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడ్చల్ ఉమ్మడి డివిజన్ బీజేపీ ఇంచార్జి పట్లోళ్ల విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని,ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో ఎస్.ఐ.ఆర్ సమీక్ష నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి,మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి కోశాధికారి లవంగ శ్రీకాంత్,మేడ్చల్ రూరల్ జిల్లా బీ.జె.వై.ఎం అధ్యక్షులు రాగం అర్జున్,రాష్ట్ర నాయకులు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్,పాతూరి సుధాకర్ రెడ్డి,మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీ గుప్త,పూడూరు మాజీ సర్పంచ్ నరసింహ రెడ్డి,మేడ్చల్ రూరల్ జిల్లా బీ.జె.వై.ఎం కార్యదర్శి బొజ్జ రాఘవ రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శిలు కానుకంటి వంశీ విజయ్ వంజరి,జకట ప్రేమ దాసు,కోశాధికారి తాళ్ళపల్లి ఉపేందర్ గుప్త,ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి,సర్వేశ్వర రెడ్డి,మల్లేష్ యాదవ్, దోసడి రామచంద్ర రెడ్డి,కార్యదర్శులు సత్యనారాయణ రెడ్డి,బండి విష్ణు గౌడ్,డీ.సాయి,కార్యవర్గ సభ్యులు దగ్గు రాజు,సీనియర్ నాయకులు ధాత్రిక లక్ష్మణ్ వంజరి,నర్సింగ్,చీర్ల సత్యనారాయణ,చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్,బచ్చు కృష్ణప్రియ మల్లారెడ్డి,నాయకులు బొజ్జ వంశీ రెడ్డి,పికెట్ నర్సింగ్,పికెట్ మల్లికార్జున్,జకట బాబు రాజు,మహేష్ గౌలికర్,మామిళ్ళ నర్సింగ్, సదమణి నరేందర్,అవినాష్ చారి,కేశవ రెడ్డి,కానుకంటి వెంకటేష్ వంజరి,దగ్గు రాజు,అర్జున్,గోపు నాగరాజు,రతన్ రాథోడ్,వెంకటేష్ చారి,రొయ్యపల్లి శ్రీనివాస్ గౌడ్,మహిళా నాయకులు తోట అనిత,శోభారాణి,అనిత తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో మెస్ కమిటీల సమక్షంలోనే వంట సరుకుల పంపిణీ చేయాలి

**కలెక్టర్ కట్టా హైమావతి**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూలై 24 :** జిల్లాలోని అన్ని గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులతో ఏర్పాటు చేసిన మెస్ కమిటీల సమక్షంలోనే వంట సరుకులను కొలత ప్రకారం అందించాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు అందించిన అన్నం, క్యాబేజీ కూర, పప్పు, రసం, పెరుగు నాణ్యతను తనిఖీ చేసి, ఆహారం రుచికరంగా ఉందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతి వంటకం నాణ్యతతో పాటు విద్యార్థులకు రుచికరంగా ఉండేలా తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, రికార్డులు సక్రమంగా నమోదు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట సిబ్బందికి సరుకులు అందించే ముందు విద్యార్థులతో ఏర్పాటు చేసిన మెస్ కమిటీ సమక్షంలోనే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. జూనియర్ అసిస్టెంట్, ఉపాధ్యాయులు, వంట సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రతి రోజు టిఫిన్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనానికి అవసరమైన సరుకులను కొలత ప్రకారం అందించిన తర్వాతే స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణలో జరిగిన నిర్లక్ష్యంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారిని (డీసీఓ) ఫోన్ ద్వారా ఆదేశించారు.

# సిద్దిపేట అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**వర్షాకాలంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి-ఎమ్మెల్యే హరీష్ రావు**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూలై 24 :** సిద్దిపేట పట్టణంలోని అభివృద్ధి పనులను వేగవంతం చేసి, పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో నాలుగు అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరే విధులు నిర్వహించడం సరైన పరిస్థితి కాదని అన్నారు. వెంటనే అదనపు ఏఈలను నియమించాలని పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీతో ఫోన్‌లో మాట్లాడి కోరారు. అలాగే రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిన మూడు రకాల చెత్త సేకరణ విధానం అమలవుతున్న సిద్దిపేటలో ఒక్క సానిటరీ ఇన్‌స్పెక్టర్ మాత్రమే ఉండడం సమంజసం కాదని పేర్కొన్నారు. పట్టణంలో మిగిలి ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించి, టెండర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. నర్సాపూర్, ఎర్రచెరువు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఎల్లమ్మగుడి, విక్టరీ చౌరస్తా, నాసర్‌పూర్ ప్రాంతాల్లో జంక్షన్ల అభివృద్ధి పనులు చేపట్టాలని, కోమటి చెరువు ప్రవేశద్వారం పార్కు అభివృద్ధితో పాటు చెరువు పరిసరాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న నాలుగు తాగునీటి ట్యాంకుల పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న బీటీ, సీసీ రోడ్ల పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని, రోడ్లపై చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మున్సిపల్ సేవలు పారదర్శకంగా సమర్థవంతంగా అందేలా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని హరీష్ రావు అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్, డీఈ, ఏఈలు, మేనేజర్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగాల లక్ష్యంగా ఉచిత శిక్షణ

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూలై 24 :** తెలంగాణ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉపాధి నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 12 వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రాల్లో నిర్వహించనున్న వివిధ పోటీ పరీక్షల ఉచిత ప్రాథమిక శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిద్దిపేట వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ పి కృష్ణ దయాసాగర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి ఉద్యోగ నియామక పరీక్షలు, బ్యాంకుల నియామక పరీక్షలు, సిబ్బంది ఎంపిక సంఘం, రైల్వే నియామక మండలి, పోలీసు నియామక పరీక్షలకు సంబంధించిన ఈ ఉచిత ప్రాథమిక శిక్షణ 125 రోజులపాటు నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమైన తేదీలు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం 25 జూలై 2026, దరఖాస్తుల చివరి తేదీ 14 ఆగస్టు 2026, ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల 18 ఆగస్టు 2026, ధ్రువపత్రాల పరిశీలన 20 నుంచి 24 ఆగస్టు 2026 వరకు, శిక్షణ ప్రారంభం 25 ఆగస్టు 2026. “అర్హతలు అభ్యర్థి తప్పనిసరిగా డిగ్రీ ఉత్తీర్ణుడై ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు మించరాదు. ప్రస్తుతం సాధారణ విద్యా కోర్సులు అభ్యసిస్తున్న వారు, ఉద్యోగంలో ఉన్న వారు, గతంలో వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రంలో ఉచిత శిక్షణ పొందిన వారు అర్హులు కారు. ప్రతి నెల 75 శాతం లేదా అంతకంటే ఎక్కువ హాజరు ఉన్న అభ్యర్థులకు ఐదు నెలల పాటు నెలకు రూ.1,000 ఉపకార వేతనం (పుస్తకాలు, రవాణా ఖర్చులతో కలిపి) అందజేయబడుతుంది. డిగ్రీలో సాధించిన మార్కులు, రిజర్వేషన్ నిబంధనలు, అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. దరఖాస్తులను వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రం అధికారిక జాలగూడు ద్వారా సమర్పించవచ్చని” ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు సిద్దిపేట మున్సిపల్ టౌన్ హాల్ సమీపంలోని వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రాన్ని లేదా 08457-224491, 9490243095 నంబర్లను సంప్రదించాలని డాక్టర్ కృష్ణ దయాసాగర్ తెలిపారు.

# సమగ్ర ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత స్థాయి సమావేశం

- **బీఎల్‌ఏలు, కో-ఆర్డినేటర్లతో సమీక్ష నిర్వహించిన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వొడితల ప్రణవ్**



**హుజురాబాద్, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలో కొనసాగుతున్న సమగ్ర ఓటరు నమోదు సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) గడువు సమీపిస్తున్న నేపథ్యంలో, బీఎల్ఏల పనితీరు, ఎదురవుతున్న సమస్యలు, సందేహాలపై కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సుడా మాజీ చైర్మన్, హుజురాబాద్ సర్ ఇన్‌చార్జి కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కమలాపూర్, వీణవంక మండలాలకు చెందిన గ్రామాల బీఎల్‌ఏలు, కో-ఆర్డినేటర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి బీఎల్ఏ వద్ద ఉన్న పూర్తి సమాచారం సంబంధిత కో-ఆర్డినేటర్ల వద్ద కూడా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఓటరు నమోదు ఫారాలు అందుబాటులో లేకపోతే వెంటనే బీఎల్ఓలకు సమాచారం ఇవ్వాలని, సమస్యలు కో-ఆర్డినేటర్ల ద్వారా తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుం దని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా హుజురాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. ప్రతి ఓటు నమోదు అయ్యేలా, ఒక్క అవకాశం కూడా వృథా కాకుండా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో హుజురాబాద్, వీణవంక మండలాల కాంగ్రెస్ నాయకులు, గ్రామాల నాయకులు, బీఎల్‌ఏలు, కో-ఆర్డినేటర్లు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దమ్మపేటలో ముత్యాలమ్మ తల్లికి చల్లన్నం సమర్పణకు ఏర్పాట్లు

- **వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామ పెద్దల సంకల్పం**



**దమ్మపేట, జూలై 24. పీపుల్స్ డైరీ :** దమ్మపేట ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతుల పంటలు పుష్కలంగా పండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా జీవించాలని కోరుతూ గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి చల్లన్నం సమర్పించే సంప్రదాయ కార్యక్రమానికి గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం నుంచి ఆదివారం వరకు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి చల్లన్నం సేకరించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ముఖ్యంగా రైతులు స్వచ్ఛందంగా పాల్గొని తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పెద్దల వివరాల ప్రకారం, ముత్యాలమ్మ తల్లికి చల్లన్నం సమర్పించే ఈ ఆచారం పూర్వకాలం నుంచి కొనసాగుతున్న విశిష్టమైన గ్రామీణ సంప్రదాయం. ప్రతి సంవత్సరం జూన్-జూలై నెలల్లో ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ సంప్రదాయం ద్వారా గ్రామానికి మంచి వర్షాలు కురవడం, పంటలు సమృద్ధిగా పండడం, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని ముత్యాలమ్మ తల్లిని ప్రార్థిస్తారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఐక్యత, భక్తి, సాంప్రదాయ విలువలకు ప్రతీకగా నిలుస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దమ్మపేట గ్రామ ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని చల్లన్నం సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# ఘనంగా జేఎస్ఆర్ జన్మదిన వేడుకలు..విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

**సేవా కార్యక్రమాలతో వేడుకలు...**



**హుస్నాబాద్,టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 24 :** బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి (జేఎస్ఆర్) జన్మదిన వేడుకలు సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ లో పట్టణ బిజెపి నాయకులు, జె ఎస్ ఆర్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి,అనంతరం కేబీ కాలని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ.. జేఎస్ఆర్ గత నాలుగేళ్లుగా నియోజకవర్గంలో ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ప్రతి వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి, కూల్ ఫ్రీజ్‌ల ద్వారా బాటసారుల దాహార్తి తీర్చడమే కాకుండా, నిరుపేద కుటుంబాలకు వివిధ రూపాల్లో ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న జేఎస్ఆర్ ఆయురారోగ్యాలతో, సుఖసంతో షాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షురాలు కాదాసు దీపిక, ప్రధాన కార్యదర్శి పోలోజు రాజేందర్ చారి, కార్యదర్శులు వడ్డెపల్లె లక్ష్మయ్య, బొప్పిశెట్టి సాయిరామ్, అకోజు అరుణ్ కుమార్, శక్తికేంద్ర ఇంచార్జి నారోజు నరేష్, సీనియర్ నాయకులు పూదరి కిష్టయ్య, వరియోగుల అనంత స్వామి, వెల్దండి సంతోష్, పోలోజు రవీందర్, కాదాసు నర్సయ్య, లకావత్ శారద, ఆశాడపు శ్రీనివాస్, నల్లా మహేందర్ రెడ్డి, నాయకులు బోనగిరి రాజేష్, గౌరవేని తిరుపతి, వొద్దిరాల అశోక్, న్యాలం సందీప్, రామకృష్ణ, వేణుగోపాల్, నేరెల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 27న జర్నలిస్టుల ‘ఛలో పార్లమెంట్’ పోస్టర్ ఆవిష్కరణ

- **జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కేంద్రం చర్యలు తీసుకోవాలి: కుడుతాడి బాపురావు**
- **టీడబ్ల్యూజేఎఫ్ ధర్నాకు బీసీ జేఏసీ సంపూర్ణ మద్దతు**



**హుజురాబాద్, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న ‘ఛలో పార్లమెంట్’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు పిలుపునిచ్చారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో జర్నలిస్టులు, వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి ‘ఛలో పార్లమెంట్’ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లేందుకు దేశవ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.


**ప్రధాన డిమాండ్లు ఇవే**

కోవిడ్ సమయంలో నిలిపివేసిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌ల పునరుద్ధరణ జర్నలిస్టుల రక్షణ చట్టం అమలు రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు పూర్తి చట్టబద్ధత జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు గతంలో అమలులో ఉన్న 50 శాతం రైల్వే ప్రయాణ రాయితీని కోవిడ్ సమయంలో నిలిపివేశారని, ఇప్పటివరకు పునరుద్ధరించకపోవడంతో వేలాది మంది పాత్రికేయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాపురావు తెలిపారు. ఈ సౌకర్యాన్ని వెంటనే పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరారు. అలాగే మీడియా రంగం విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా ఒకే విధమైన జాతీయ పెన్షన్ పథకాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో జర్నలిస్టులపై దాడులు, హత్యలు, అక్రమ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని కేంద్రాన్ని కోరారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు పూర్తి చట్టబద్ధత కల్పించడంతో పాటు పాత్రికేయ సంఘాలు, జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**బీసీ జేఏసీ మద్దతు**

ఈ సందర్భంగా బీసీ జేఏసీ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ, జర్నలిస్టుల న్యాయమైన సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ చేపడుతున్న ‘ఛలో పార్లమెంట్’ ఉద్యమానికి బీసీ జేఏసీ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు సౌడమల్ల యోహాన్, నాయకులు రాఘవుల శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, ఇప్పకాయల సాగర్ (ప్రజా ప్రతిభ జిల్లా బ్యూరో), శంకర్, శ్రీనివాస్, రవీందర్, మధు, కొండ గణేష్, సందేల వెంకన్న, కొలిపాక క్రాంతికుమార్, మావునూరి ప్రవీణ్ కుమార్, సంగం సత్యనారాయణ, సంగం శ్రీనివాస్, సొల్లు శంకర్, కొక్కుల రవీందర్, ఆర్ఎంపీ పిట్ట శ్రీనివాస్, గొల్లపల్లి రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

# మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్, జూలై 24(పీపుల్స్ డైరీ):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ‘మై భారత్’ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు మరియు ఇతర భాగస్వాములు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆమోదంతో జిల్లా సలహా కమిటీ (ణాజ), జిల్లా సమన్వయ కమిటీ (ణాజ)లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ‘మై భారత్’ పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వచ్ఛంద సేవ, నాయకత్వ అభివృద్ధి, నైపుణ్యాల పెంపు, ఇంటర్న్‌షిప్‌లు మరియు దేశ నిర్మాణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. మల్కాజిగిరి జిల్లాకు 80,044 మంది యువత నమోదు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి అర్హ యువకుడు పోర్టల్‌లో నమోదు అయ్యేలా కళాశాలలు, విశ్వ విద్యాలయాలు, ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, పురపాలక సంస్థలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, యువజన క్లబ్‌లు, స్వయం సహాయక సంఘాల సహకారంతో అవగాహన కార్యక్రమాలు, నమోదు శిబిరాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ బి. స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్ మై భారత్ కార్యక్రమం లక్ష్యాలను వివరించగా, అనంతరం అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ సి. శివప్రసాద్, డీఐసీ జనరల్ మేనేజర్ డి. వినయ్ కుమార్, జిల్లా యువజన సేవలు, క్రీడల ఇన్‌చార్జ్ అధికారిణి రేణుకా దేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి డా. ఎం. హరిప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు..



## వరి పంటకు బదులు ఆరుతడి పంటలు వేయాలి

**నర్సంపేట, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** వరి పంటా బదులు ఆరుతడి పంటలు వేయాలి అని రైతులకు అవగాహన కార్యక్రమం మదన్నపేటలో నిర్వహించడం జరిగింది. ఈ ప్రోగ్రామ్ లో ఎల్ నినో ప్రభావం వల్లన వర్షాలు సరిగ్గా పడక పోవటం వలన వరి నాటు వేస్తే నీళ్ళు సరిపోక ఎబ్బండి పడవలసి వస్తుంది. రైతులు ప్రత్యమ్నయంగా అపరాలు జొన్న కూరగాయలు చిరు దన్యాలు ఈతర తగ్గువ నీరు వాసరం ఉన్న పంటలు వేసుకోవాలి చెరువులో నీరు నిలవ లేనందున వరి పంట వేయకూడదు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి కృష్ణకుమార్ వ్యవసాయ విస్తరణ అధికారి సింధురైతులు పాల్గొన్నారు

## చిన్నారి జాహ్నవికి బీఆర్ఎస్ చేయూత



**నూగురు వెంకటాపురం, జూలై 24(పీపుల్స్ డైరీ) :** జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న గుండారపు రాజేష్, మమత దంపతుల కుమార్తె జాహ్నవికి కేటీఆర్ జన్మదినం సందర్భంగా వెంకటాపురం బిఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో 20 వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని అందించారు. శుక్రవారం బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలోని ర.భ అతిథి గృహ ఆవరణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు, జిల్లా నాయకులు గొడవర్తి నరసింహమూర్తి చిన్నారి తల్లిదండ్రుల చేతికి 20వేల రూపాయలు అందజేశారు. చిన్నారి ఆరోగ్యంపై వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే పార్టీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి, తమ వంతు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సర్పంచులు ఇర్ప మురళి, ఆదిలక్ష్మి, రమ్య, సీనియర్ నాయకులు వేల్పురి లక్ష్మీనారాయణ, ముదుంబా శ్రీనివాసరావు, గడ్డం వివేక్, రామెల్ల మోహన్ రావు, బట్ట ఏడుకొండలు, బేగ సాంబశివరావు, వెంకటేశ్వర్లు, బట్ట నాగేంద్ర, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లపై శిక్షణ



**నర్సంపేట, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** గీత కార్మికులు తాడిచెట్లు ఎక్కేసమయంలో జరిగే ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ కిట్) ఎంతో ఉపయోగకరమని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ అన్నారు.వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని దుగ్గొండి మండల కేంద్రంలోని రేణుక--ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో బీసీ కార్పొరేషన్, అబ్కారీ శాఖల ఆధ్వర్యంలో నల్లబెల్లి, దుగ్గొండి మండలాలకు చెందిన గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం (కిట్) వినియోగంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతుల రమేష్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న శిక్షణను గీత కార్మికులు సద్వినియోగం చేసుకుని రక్షణ కిట్లను తప్పనిసరిగా వినియోగించి ప్రమాదాల నుంచి తమ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కందాల శంకరయ్య గౌడ్, అబ్కారీ శాఖ సీఐ నరేష్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్, మోకుదెబ్బ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జి కందుల శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాచర్ల దేవేందర్ గౌడ్, దుగ్గొండి, నాగరాజుపల్లి,మల్లంపల్లి గౌడ సంఘాల అధ్యక్షులు గైని భాస్కర్ గౌడ్, ఊటుకూరి రమేష్ గౌడ్, జక్కి రాములు గౌడ్, ముత్యాల సాంబయ్య గౌడ్, చుక్క సాంబయ్య గౌడ్, అంబాల సదయ్య గౌడ్, బోడిగె రమేష్ గౌడ్, ఊటుకూరి శ్రీనివాస్, దొనికెల సదానందం గౌడ్,కక్కెర్ల ఆనందం గౌడ్,కక్కెర్ల రాజు గౌడ్,కందుల కుమారస్వామి గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం



**గీసుకొండ, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** గంగదేవిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కూసం స్వరూప్-రమేష్, ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి ఆరు రకాల మొక్కలను పంపిణీ చేశారు. పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఇంటిలో మొక్కలు నాటే సంస్కృతిని అలవాటు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ సందర్భంగా సర్పంచ్ కూసం స్వరూప్-రమేష్ మాట్లాడుతూ, "మొక్కను నాటడమే కాదు... దానిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత. మనం నాటే ప్రతి మొక్క రాబోయే తరాలకు అమూల్యమైన సంపద" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేడిద ప్రశాంత్, గ్రామ కార్యదర్శి రాజు, సీఏ పెండ్లి జనార్ధన్, గ్రామ కరబార్ చెంచు రాజు, ఆశా వర్కర్ కూస పద్మ, వార్డు సభ్యులు కన్నె లింగమూర్తి, పెండ్లి కొమురెల్లి, గోనె రామ, గూడ మంజుల, కొడారి కవిత, సల్ల రాజ్‌కుమార్, గ్రామ పెద్దలు గోనె రాజయ్య, గోపతి మల్లయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ముసలమడుగులో దొంగతనం



**ఏన్కూరు, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం, ముసల మడుగు గ్రామంలోని ఒక ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారం, ఇతర వస్తువులను దొంగిలించారు. దొంగతనం చేసి కారులో పారిపోతున్న నలుగురు వ్యక్తులను వాహనాల తనిఖీ సమయంలో పోలీసులు అనుమానాస్పదంగా గుర్తించి స్టేషన్‌కు తరలించారు. బూర్గంపాడు మండలంలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తులుగా వీరు భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సమగ్ర దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని ఎస్సై సంధ్య తెలిపారు.

## నీలా క్రమంలో భద్రకాళి మాత



**మట్టెవాడ, జూలై 24 (పీపుల్స్ డైరీ):** వరంగల్ మహా నగరంలోని శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు శుక్రవారంతో పదవ రోజుకు చేరుకున్నాయి. జ్యోతిశ్శాస్త్రం ప్రకారం దశమీ తిథికి ఆది దేవత యముడు. ఈ తిథికి దశ మహావిద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి నీలా అమ్మవారు ఆదిదేవత. ఈమె యముని యొక్క సంహార శక్తి ఈమెను ఆరాధించిన వారిని మృత్యువు బాధించదు. ఈమె భక్తులు దీర్ఘమైన ఆయుష్షును కలిగియుంటారు. అనగా ఈతి బాధలు ఈమె భక్తుల దరిచేరవు. ఇహపర సౌఖ్యాలను ఈ నీలా అమ్మవారు ప్రసాదిస్తుంది. అట్లాగే షోడశీ క్రమాన్ని అనుసరించి ఈ రోజుకు ఆదిదేవత నిత్యా భక్తులకు శాశ్వతమైన ఆనందాన్ని ఈ మాత ప్రసాదిస్తుంది. కాబట్టి ఈ మాతను నిత్యా అని శాస్త్రాలు చెబుతున్నాయని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. ఈ రోజు శుక్రవారం కూడా కావడంతో భక్తులు దేవాలయానికి అమ్మవారి దర్శనమునకు పోటెత్తారు. దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయుట జరిగిందని ఈఓ శ్రీమతి సునీత తెలిపారు. శుక్రవారం అమ్మవారిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. పూజానంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందచేశారు. అనంతరం ఆలయంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మాడవీధులు, రాజగోపురం నిర్మాణం ప్లాను కుడా అధికారి అజిత్ రెడ్డి, ఈఓ శ్రీమతి సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వరుణ్, దేవాలయ సిబ్బంది హరినాథ్, కృష్ణ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ టెండర్ పురోగతిని సమీక్షించిన కమిషనర్



**మట్టెవాడ, జూలై 24 (పీపుల్స్ డైరీ):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ (యూజీడీ) ప్రాజెక్టు టెండర్ ప్రక్రియ పురోగతిపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న శుక్రవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు, బిల్డ్‌కాన్ సంస్థ ప్రతినిధులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా టెండర్ ప్రక్రియ ప్రస్తుత స్థితి, చేపట్టాల్సిన తదుపరి చర్యలపై అధికారులతో సవివరంగా చర్చించి, పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ జీడబ్ల్యూఎంసీ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఏడు ఎస్‌టీపీల (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) కోసం అవసరమైన భూసేకరణ పూర్తయిందని తెలిపారు. టెండర్ ప్రక్రియ ప్రస్తుతం తుది దశలో ఉన్నందున, మిగిలిన ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో బల్దియా సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, బిల్డ్‌కాన్ సంస్థ ప్రతినిధి అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 15 మందికి జరిమాన

**మట్టెవాడ, జూలై 24 (పీపుల్స్ డైరీ):** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి, ట్రాఫిక్ అదనపు డీసీపీ ఆర్.ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసిపి టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 15 మంది వ్యక్తులను వరంగల్ సెకండ్ క్లాస్ కోర్టు 3వ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ అంకేశ్వరపు కమలాకర్ ఎదుట హాజరు పరచగా 15 మంది వ్యక్తులకు కోర్టు రూ.13,600 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కోదూరి సుజాత తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపిన ఒక వాహన దారుడికి కోర్టు రూ.500/- జరిమానా విధించినట్లు సీఐ సుజాత వెల్లడించారు.

## పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణం వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



**నర్సంపేట, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఖానాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గ్రాంఇజ) నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఖానాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆసుపత్రి భవనం, మౌలిక సదుపాయాలు, వైద్య సేవలపై సమగ్రంగా పరిశీలించారు.ప్రస్తుతం ఉన్న పాత భవనాన్ని పూర్తిగా తొలగించి, అదే స్థలంలో నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.నూతన భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ఆసుపత్రికి సమీపంలో ఖాళీగా ఉన్న బీసీ హాస్టల్ భవనాన్ని తాత్కాలికంగా వినియోగించే అవకాశాన్ని పరిశీలించారు. భవనంలో అవసరమైన మరమ్మతులు, పరిసరాల పరిశుభ్రత పనులకు అయ్యే వ్యయంపై అంచనాలు సిద్ధం చేసి వెంటనే నివేదిక సమర్పించాలని పీఆర్ ఇంజినీర్లను ఆదేశించారు. అంచనాలు అందిన వెంటనే మరమ్మతులు పూర్తి చేసి ఆసుపత్రిని తాత్కాలికంగా అక్కడికి తరలించి, నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. తనిఖీలో భాగంగా వ్యాక్సిన్ స్టోర్ రూమ్, మందుల నిల్వలు, హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. తనిఖీలో ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఐ. ప్రకాష్, ఖానాపూర్ వైద్యాధికారి డా. జ్యోతి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో అదనపు సిబ్బంది

### అధికారుల అండదండలతో కొనసాగుతున్నారా...?

**గోవిందరావుపేట, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరానికి మించి అదనపు సిబ్బందిని నియమించి సంబంధిత శాఖ అధికారులు ప్రజాధనం దుర్వినియోగపరుస్తున్నార ని పలు విమర్శలు వెళ్ళు ఎత్తుతున్నాయి, గతంలో సిబ్బంది లేక కలెక్టర్ జనరల్ పంట నుండి తాత్కాలిక సిబ్బందిని నియమించినట్లు తెలుస్తుంది, అప్పుడు నియమించిన సిబ్బంది నేటి వరకు జిల్లా అధికారుల అండదండలతో కొనసాగుతూ పూర్తి కాలం పనిచేస్తున్న వైద్య సిబ్బందిని తాత్కాలిక సిబ్బంది గొడవలు సృష్టిస్తూ పేషంట్లను ఆప్యాయతగా పలకరించక పోగా వారిని బెదిరించినట్టు మాట్లాడుతున్నారని పలువురు పేషెంట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, అంతేకాకుండా ఆసుపత్రిలో పూర్తి స్థాయి సిబ్బంది ఉన్నప్పటికీ కూడా ఆసుపత్రుల్లో సిబ్బంది క్రమశిక్షణ లోపించిందని పలువురు చర్చించుకుంటున్నారు, డిప్యూటేషన్ పై పని చేస్తున్నట్లు తెలుస్తుంది కొంతమంది వైద్య సిబ్బంది వైద్యాధికారులతో మాయ మాటలు చెప్పి గతంలో ఉన్న సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిసింది , ఇలాంటి వైద్య సిబ్బంది ఆస్పత్రులకు డిప్యూటేషన్ పై రావడంతో రోగుల ఆసుపత్రికి రావాలంటే బందేలెత్తిపోతున్నట్లు పలు రోగులు చెబుతున్నారు, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఆసుపత్రులపై తనిఖీలు నిర్వహించి అదనపు సిబ్బందిని అవసరమన్న ఆసుపత్రుల్లో నియమించినట్లయితే రోగులకు న్యాయం జరుగుతుందని పలువురు కోరుతున్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో అప్రమత్తంగా ఉండాలి : ఏఓ ఐలయ్య

**గణపురం, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఐలయ్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడం, అధిక ఉష్ణోగ్రతలు, వర్షాల పంపిణీలో అసమా నతలు ఏర్పడే అవకాశముందని పేర్కొన్నారు. నీటి కొరతను తట్టుకునే జొన్న, సజ్జ, రాగులు, మొక్కజొన్న, పెసర, మినుము, కందులు, ఉలవలు, నువ్వులు, ఆముదం, వేరుశెనగ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ప్రయోజనక రమన్నారు. అలాగే నేలలో తేమ సంరక్షణ, మల్చింగ్, సకాలంలో కలుపు నివారణ, వర్షపు నీటి సంరక్షణ, నీటి పొదుపు పద్ధతులను పాటించడం ద్వారా పంట నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ఐలయ్య విజ్ఞప్తి చేశారు.

## దేశ ద్రోహులను సమర్థించే కాంగ్రెస్ వైఖరిని ప్రజలు ఎన్నటికీ క్షమించరు

### బీజేపీ పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

**నర్సంపేట, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** దేశ వ్యతిరేక శక్తులకు పరోక్షంగా అండగా నిలుస్తూ, దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ పార్టీ విధానాలను నిరసిస్తూ నర్సంపేట నియోజకవర్గంలోని వరంగల్ రోడ్ సర్కిల్ వద్ద భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాట్లాడే శక్తులకు కాంగ్రెస్ పార్టీ పదేపదే మద్దతు ఇవ్వడం అత్యంత దురదృష్టకరం" అన్నారు. దేశద్రోహ భావజాలాన్ని ప్రోత్సహించే వారిని సమర్థిస్తూ కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు.

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం - నీట్‌పై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో విధంగా వ్యవహరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. నీట్ వంటి జాతీయ స్థాయి వైద్య ప్రవేశ పరీక్షపై కూడా కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని, నీట్ అంటే అర్థం కూడా తెలియని వారు కూడా వీధుల్లోకి వచ్చి పోరాటాలు చేస్తున్నారు. ఇది చాలా ఆశ్చర్యకరం"అని మండిపడ్డారు.కానీ కాంగ్రెస్ మాత్రం విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోకుండా, కేవలం రాజకీయ లబ్ధి కోసం నీట్ పేపర్ లీక్‌ను అడ్డుపెట్టుకొని దేశ విద్రోహ శక్తుల తరఫున పోరాటం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిగా విస్మరించి ప్రజలను



మభ్యపెట్టే రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని అడ్డుపెట్టుకుని అరాచక రాజకీయాలకు పాల్పడటం కాంగ్రెస్ నిజస్వరూపాన్ని బయటపెడుతోందని వ్యాఖ్యానించారు.దేశ సమగ్రత, జాతీయ భద్రత, రాజ్యాంగ పరిరక్షణ విషయంలో భారతీయ జనతా పార్టీ ఎలాంటి రాజీ పడదు. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులపై బీజేపీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

# కేజీకేఎస్ గీతన్నల రాష్ట్ర చైతన్య బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



**కేసముద్రం, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "అమరుల యాదిలో.. గీతన్నల చైతన్య యాత్ర" రాష్ట్ర బస్సు యాత్ర పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాజీ శాసన మండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కేజీకేఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ అధ్యక్షత వహించ గా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాని కి సమ్మి ఫౌండేషన్ చైర్మన్, గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల హక్కుల పరిరక్షణ, గీత వృత్తి అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, గీత కార్మిక కుటుంబాల ఆర్థిక భద్రత కోసం చేపడుతున్న బి'గీతన్నల చైతన్య యాత్ర'ను ప్రతి గీత కార్మికుడు తన సొంత కార్యక్రమంగా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, వారి సంక్షేమం కోసం అందరూ సంఘటితంగా ముందుకు సాగాలని అన్నారు. ఆగస్టు 2న మహబూబాబాద్లో ప్రారంభమయ్యే రాష్ట్ర బస్సు యాత్రకు కేసముద్రం మండలంతో పాటు ఉమ్మడి మండల పరిధిలోని ప్రతి గ్రామం నుంచి గీత కార్మికులు, యువత, సంఘం నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి చైతన్య యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్ , గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణరావు గౌడ్ గోపా రాష్ట్ర అధ్యక్షులు బండి సాయన్న గౌడ్ గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, వంగ సదానందం గౌడ్, ప్రభులింగం గౌడ్, వి. వెంకట నరసయ్య పాల్గొన్నారు.



## చేనేత సంఘం నూతన పాలకవర్గానికి సన్మానం

**శాయంపేట, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** మండలంలో ఇటీవల జరిగిన చేనేత సహకార సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన సంఘం అధ్యక్షులు బాసని ప్రకాష్, ఉపాధ్యక్షులు దిడ్డి రమేష్, కార్యదర్శి వనం దేవరాజ్, కోశాధికారి బాసాని నవీన్, డైరెక్టర్ వల్పదాసు స్వరూపలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల కీర్తి రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ చేనేత రంగం దేశ సంస్కృతికి, తెలంగాణ ప్రత్యేకతకు ప్రతీక అని అన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘాల బలోపేతం కోసం భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం చేనేత కార్మికుల విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శకంగా పనిచేసి, సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో శాయంపేట చేనేత సహకార సంఘం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు నరహరిశెట్టి రామకృష్ణ,ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పు రాజు, కోమటి రాజశేఖర్, నాయకులు, చేనేత కార్మికులు, సంఘ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నకిలీ ప్రకటనలు నమ్మకండి

**ఎస్సై పోచంపల్లి సతీష్**



**చిట్యాల, జూలై 24(పీపుల్స్ డైరీ) :** ఆకర్షణీయమైన నకిలీ ప్రకటనలను చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలెవరూ నమ్మవద్దని చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల సోషల్ మీడియా మరియు ఇతర మార్గాల్లో తొలి ఏకాదశి స్పెషల్ రూ. 500 కొట్టు మేకను పట్టు అంటూ వస్తున్న ప్రకటనల పట్ల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని కోరారు.?కేవలం రూ. 500 కే 10 కేజీల మేక అంటూ 30 టోకెన్ల పేరుతో ప్రజలను ఆకర్షించి సొమ్ము చేసుకునేందుకు కొందరు కేటుగాళ్లు ఇలాంటి చట్టవిరుద్ధమైన ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. మోసపూరిత ప్రకటనలు నమ్మవద్దు అని తెలిపారు. అనుమతి లేకుండా టోకెన్ వ్యవస్థ లక్కీ డ్రాలు లేదా జూదం వంటి కార్యకలాపాలు నిర్వహించడం చట్టప్రకారం తీవ్రమైన నేరం అన్నారు. మీ పరిధిలో ఇలాంటి అనుమానాస్పద లాటరీలు టోకెన్ విక్రయాలు లేదా మోసపూరిత ప్రకటనలు కనిపించినట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా 100 కు డయల్ చేసి సమాచారం అందించగలరు అని కోరారు.

## సిఐటియు పోరాట ఫలితమే పాఠశాలల్లో గ్యాస్ స్టౌల పంపిణీ

**జల్లే జయరాజు, సిఐటియు మండల కార్యదర్శి**



**కేసముద్రం, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో పత్రిక విలేకరులతో సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు మాట్లాడుతూ గత కొన్ని ఏండ్ల నుండి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు కట్టెల పొయిలతో ప్రయాసపడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనం వండుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో దఫాలుగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై పోరాటాలు చేసినా ఫలితం లేదని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిఐటియు ఆధ్వర్యంలో వంట గ్యాస్, కోడిగుడ్లు ప్రభుత్వమే సప్లై చేయాలని పోరాటాలు నిర్వహించాం. ఆ పోరాట ఫలితంగానే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో వంట గ్యాస్ పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. అయితే హైస్కూళ్లలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన చిన్న స్టవ్ లపై పెద్ద వంట గిన్నెలు పెట్టి వంటలు వండేందుకు వీలుకావడం లేదు. ఆయా హైస్కూళ్లలో మధ్యాహ్న భోజన కార్మికులే పెద్ద స్టవ్వులు కొనుక్కోవాలని అధికారులు చెప్పడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## గుట్కా,అంబర్, సిగరెట్ ప్యాకెట్స్ పట్టివేత, కాల్చివేత



**సంగెం, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** సంగెం గ్రామం మండలం పోలీస్ స్టేషన్ పరిధి తిమ్మాపూర్, ఎల్గురు రంగంపేట, పల్లారు గూడ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పరిధి 100 మీటర్లు కిరాణ షాపు అక్కడి పుట్ పాత్ రోడ్డు యందు విక్రయిస్తున్న అంబర్, గుట్కా, సిగరెట్స్ పెట్రోలింగ్ లో భాగంగా అక్రమంగా విక్రయిస్తున్న అక్కడి నిందితులను సంగేమ్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కే. వంశీకృష కానిస్టేబుల్స్ బృందం సుమారు 18 వేల రూపాయల క్వాంటిటీ గుట్కా, అంబర్, సిగరెట్స్ వాటిని స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసుకొని ఈ రోజు స్పెషల్ సెకండ్ క్లాసు మెజిస్ట్రేట్ దాస్యం. రంగనాథ స్వామి ఎక్సైజ్ కోర్టు వారి స్టాఫ్ శ్రీరామోజు. అనూష, అటెండర్ ఎన్. శ్రీకాంత్ సంగేమ్ పోలీస్ పరిధి కానిస్టేబుల్ ఎం. క్రాంతి, ఇ.సధానందం కోర్టు లో హాజరు పరిచి వారికీ ఫైన్ కట్టించి డంపింగ్ సెక్షన్ హనంకొండ లోని శాయం పేట రైల్వే ట్రాక్ దగ్గర పెట్రోల్ పోసి పూర్తిగా కాల పెట్టడం జరిగింది, క్రైమ్ నెంబర్ 55,56,58 కోప్టో యాక్ట్ క్రింది నిందితులకు అపరాధ రుసుము మూడు కేసులకు చెల్లించి కేసు డిస్పోస్, డిస్ట్రాయ్ చేశారు. ఈసందర్భంగా అక్రమ నిషేదిత అనుమతి వస్తువులు నివాస విద్యాసంస్థ స్థలాల్లో విక్రయాలు చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు శిక్షలు తప్పవని పోలీస్ సిబ్బంది చెప్పారు.

## టీఎల్ఎంను ఉపయోగించి బోధనను కొనసాగించాలి..

**ఎంఈఓ కాలేరు యాదగిరి..**



**కేసముద్రం, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** ఉపాధ్యాయులు టీఎల్ఎం ను ఉపయోగించి బోధనను కొనసాగించాలని కేసముద్రం మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి అన్నారు. ఎఫ్ ఎల్ ఎన్ ఎన్రిచ్మెంట్ కార్యక్రమం లో భాగంగా రెండవ రోజు శుక్రవారం కేసముద్రం విలేజ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు, గణితం పైన ఉపాధ్యాయులకు ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్ గా వ్యవ హరిస్తున్న మండల విద్యాధికారి కాలేరు యాదగిరి మాట్లాడుతూ.. 60 రోజుల రెమిడీ యల్‌లో భాగంగా తెలుగు భాష నైపుణ్యాలైన వినడం , మాట్లాడటం, పఠనం, లేఖనంపైన ప్రత్యేక శ్రద్ధ చూపా లని, టీఎల్ఎంను ఉపయోగించి వైయక్తిక భేదాలను దృష్టిలో పెట్టుకొని బోధనను కొనసాగించాలని తెలిపా రు. అదేవిధంగా గణితంలో చతుర్విధ ప్రక్రియలైన కూడికలు, తీసివేతలు, గుణకారాలు, బాగా హారాలను టిఎల్ఎం ను ఉపయోగించి పిల్లలు బోధనలో భాగస్వాములయ్యేలా చూడాలని సూచించారు. ప్రతి పాఠశాలలో స్కొటింగ్ యూనిట్ ను ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ కాలేరు యాదగిరి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఆర్పీలు వట్నాల సత్యనారాయ ణ, వై. అశోక్,వి. భాస్కర్ రావు, ఈ. భాస్కర్, కె. సురేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర



**శాయంపేట, జూలై 24,(పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 1.15 కోట్ల వ్యయంతో మంజూరైన పలు సీసీ రోడ్లను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రహదారుల అభివృద్ధిని ప్రజా ప్రభుత్వం వేగవంతం చేస్తోందని తెలిపారు. గట్ల కానిపర్తి, సూరంపేట, కొత్తగట్టు, సింగారం, గోవిందపూర్, పెద్దకోడేపాక, జోగంపల్లి, మైలారం, శాయంపేట, పత్తిపాక, ప్రగతి సింగారం, నేరేడుపల్లి ,గంగిరేణి గూడెం తదితర గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి గ్రామానికి 5 లక్షలు, పెద్ద గ్రామాలకు ?10 లక్షల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం గ్రామ ప్రజల సమస్యలు, అవసరమైన మౌలిక సదుపాయాలపై స్థానికులతో మాట్లాడి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా యుగేందర్

**చిట్యాల, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చిట్యాల మండల అధ్యక్షుడిగా జన్నె యుగేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజనీకాంత్ ఆదేశాల మేరకు నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర సహాయ కార్యదర్శి మందల రవీందర్ రెడ్డి నియోజకవర్గ కన్వీనర్ పైడిపల్లి రమేష్ జిల్లా నాయకులు పున్నం రవి కత్తి సంపత్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం వారి హక్కుల పరిరక్షణ సమస్యల పరిష్కారం కోసం ఫోరం నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు చాటుతూ ఉద్యమకారులను ఏకం చేసే దిశగా నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా సాద మల్లయ్య ప్రధాన కార్యదర్శిగా కన్నెబోయిన అశోక్ ఉపాధ్యక్షులుగా సంగ రాజేందర్ మర్రి నరేష్ జాలిగపు కృష్ణయ్య కార్యదర్శులుగా పువ్వాటి హరికృష్ణ దొడ్డే శంకర్ బయగాని గణపతి సాదరాజు గుర్రపు రమేష్ వేముల శ్రీనివాస్ కోశాధికారిగా కంచర్ల కుమారస్వామిని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా జంబుల చంద్రమౌళి పల్లె శశిధర్ రెడ్డి గోల్కొండ చక్రపాణి మోత్కూరు సంతోష్ బుర్ర రవీందర్ కాత్రేవుల రాజయ్య చెక్క నర్సయ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.



నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు యుగేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీ చిట్యాల మండలంలోని తెలంగాణ ఉద్యమకారులందరికీ ఉద్యమ అభివందనలు తెలిపారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఉద్యమకారుల హక్కుల సాధన సంక్షేమం కోసం అంకిత భావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ముకిరాల మధువంశీకృష్ణ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి ఆరేపల్లి మల్లయ్య కట్కూరి నరేందర్ కాత్రేవుల కుమార్ ఇజిగిరి ఆనందం మ్యాదరి రామచందర్ టేకుమట్ల మండల అధ్యక్షుడు బొడ్డు తిరుపతి బొట్ల రవి గురుకుంట్ల కిరణ్ మోత్కూరి సంతోష్ గొర్రె సతీష్ రాయిని శ్రీకాంత్ పెండ్లి యాదిరెడ్డి మూసాపురి రవీందర్ ఉప్పుల కిరణ్ రాజు నాయక్ కోడెల రాజమల్లు పుష్పలీల తదితరులు పాల్గొన్నారు.



## బీరన్న ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి : ప్రశాంత్



**మొగుళ్ళపల్లి, జులై 24 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో బీరన్న బోనాల ఉత్సవాలను కురుమ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసం బోనాల సందర్భంగా డప్పు చప్పుళ్లతో మంగళ వాయిద్యాల మధ్య మహిళలు బోనాలను ఎత్తుకొని ర్యాలీగా బీరన్న గుడి వద్దకు వెళ్లి బోనాలను సమర్పించారు. అనంతరం టెంకాయలను కొట్టి, యాటపోతులతో బీరన్నకు హారతినిచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన నాయకుడు రాస ప్రశాంత్ మాట్లాడుతూ. బీరన్న ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలతో, సంతోషకరమైన జీవితం గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాస బిక్షపతి కురుమ, కురుమ కులస్తులు రాస ఐలయ్య, యాదవ సంఘం మండల నాయకులు కొడారి రాజు యాదవ్, మ్యాకల సమ్మయ్య యాదవ్, ఉడుత బుచ్చయ్య యాదవ్, రాస అయిలమ్మ, రాస సౌందర్య, రాస సుజాత పాల్గొన్నారు.

## కవిత్వాన్ని ఆయుధంగా మలిచిన ప్రజాకవి జాషువా



**చిట్యాల, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు గురుకుంట్ల కిరణ్ అధ్యక్షతన కవి రచయిత గుర్రం జాషువా 55వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య హాజరై మాట్లాడుతూ కవిత్వాన్ని ఆయుధంగా మలిచిన ప్రజా కవి గుర్రం జాషువా అన్నారు. రాజు చనిపోతే తార రాలుతుంది కవి చనిపోతే తార నింగిని చేరుతుంది అన్న గొప్ప నవయుగ చక్రవర్తి జాషువా అన్నారు. బాల్యంలోనే కుల వ్యవస్థ అంటరానితనం అవమానాలు ఎదుర్కొన్నాడని అన్నారు. సాహిత్యం అభ్యసించిన ఆయన 39 గ్రంథాలను వందలాది కవిత్వాలను రాశాడని తెలిపారు. ఆయన శివాజీ ప్రబంధం భారతమాత బుద్ధుడు తెలుగు తల్లి క్రీస్తు నాగార్జున సాగరం వంటి రచనలతో మత కుల మూఢచారాలపై గలమెత్తాడని అన్నారు. నేటి యువత ఆయన బాటలో పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు మండల నాయకులు పాముకుంట్ల చందర్ దబ్బేట రవి పర్లపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేసముద్రంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు



**కేసముద్రం, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం పురపాలక సంఘం పరిధిలోని భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయంలో భారత రాష్ట్ర సమితి రాష్ట్ర కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కోసి కల్వకుంట్ల తారక రామారావుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు భగవంతుడు ప్రసాదించాలని కోరారు. గత ప్రభుత్వంలో సమాచార సాంకేతిక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన కల్వకుంట్ల తారక రామారావు రాష్ట్ర ప్రజలకు, పట్టణ ప్రజలకు మంచి సేవలు అందించారని కొనియాడారు. ప్రజల అవసరమే తన అవసరంగా భావించి ప్రతి ఒక్కరికి సేవ చేశారని, భవిష్యత్తులో ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తారని ఆకాంక్షించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని హరితహారం కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యాలయంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు రావుల శ్రీనాథ్ రెడ్డి మాజీ పట్టణ పార్టీ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్, మాజీ మండల అధ్యక్షులు జాటోద్ హరీష్ నాయక్ ఏక కిటికీ సంచాలకులు కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి పురపాలక సంఘం సభ్యులు రావుల వినయ్ రెడ్డి, పైరాల శరత్ కుమార్, మేకల శారద సురేష్, దూడపాక కృష్ణ బానోత్ అరుణకుమారి దేవేందర్, కొమ్ము స్వాతి రాహుల్, ధరావత్ రవీందర్ సర్పంచులు వాంకుడోత్ రవి నాయక్, సునీతకుమారస్వామి, తారా సింగ్, పెద్ద వెంకన్న, నజ్జు, కాసు సాయి, రమేష్, భీమ, నాగూర్ పాష, కట్టమల్లు, కొమురెల్లి తదితర నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు

# యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి





**బ్లాక్‌స్పాట్లలో భద్రతా పనులు త్వరితగతిన పూర్తి చేయాలి**

**ప్రతి నెల మూడవ శుక్రవారం సమీక్ష**

**ఖమ్మం కార్పొరేషన్, కల్లూరు, మధిర, సత్తుపల్లి, ఏదులాపురం, వైరా పట్టణాల్లో వీధి వ్యాపారాలకు రెడ్‌జోన్ ప్రాంతాలు గుర్తించాలి**

**రోడ్డు భద్రతా చర్యలపై సమీక్షించిన కలెక్టర్**

**ఖమ్మం, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, రోడ్డు భద్రతా విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి పోలీస్, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, మున్సిపల్, తదితర శాఖల అధికారులతో రోడ్డు భద్రతా చర్యలపై సమీక్షించారు. సమావేశం ప్రారంభంలో గత సమావేశంలో ఇచ్చిన ఆదేశాల అమలు నివేదిక (యాక్షన్ టేకెన్ రిపోర్ట్)ను కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్లలో చేపట్టిన అన్ని రోడ్డు భద్రత పనులను అత్యంత త్వరగా పూర్తి చేయాలని, జాతీయ రహదారులపై చేపట్టాల్సిన పనులను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పూర్తి చేయాలని, రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. జాతీయ రహదారుల వార్షిక నిర్వహణ పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. పోలీస్ శాఖ సమర్పించిన గణాంకాలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో బ్లాక్ స్పాట్లను గుర్తించి సరిదిద్దే చర్యలు చేపట్టినప్పటికీ, ఇప్పటికీ దాదాపు ప్రతి రోజూ ఒకరు ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రాణాంతక ప్రమాదాలకు గల కారణాలను శాస్త్రీయంగా విశ్లేషించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, అత్యవసర చర్యలు అవసరమైన చోట్ల యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి నెల మూడవ శుక్రవారం రోడ్డు భద్రత సమీక్ష సమావేశం నిర్వహిస్తామని, పోలీస్, జాతీయ రహదారుల శాఖ, ఆర్ అండ్ బి అధికారులు సంయుక్తంగా రోడ్లను పరిశీలించి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రతిపాదనలు, ప్రణాళికలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వేగ నియంత్రణ కోసం ప్రతిచోటా స్పీడ్ బ్రేకర్లకే పరిమితం కాకుండా, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో జిగ్‌జాగ్ ట్రాఫిక్ మూవ్‌మెంట్ వంటి ప్రత్యామ్నాయ ఇంజినీరింగ్ చర్యలను అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రాధాన్యతా పనులపై నివేదిక ఇవ్వాలని సూచించారు. జాతీయ రహదారులపై గుర్తించిన అక్రమ ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్ఓ సి.హెచ్. రామ్మూర్తి, నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ రామారావు, ఐఆర్ఏడి డి.ఆర్.ఎం.ఎస్ హరి బాబు, పోలీస్, రోడ్లు భవనాల శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, తదితరులున్నారు.

## ఆగస్టు 30 నాటికి యూనిఫాంలు అందించాలి

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**ఖమ్మం, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** ఆగస్టు 30 నాటికి ప్రభుత్వ, రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ పాఠశాలల విద్యార్థులందరికీ రెండు జతల నాణ్యమైన యూనిఫాంలను అందించేలా అన్ని దశల్లో పకడ్బందీ ప్రణాళికతో పనిచేసి, నిర్దేశిత గడువులోగా కుట్టు పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, సెర్ప్ సీఈవో దివ్య, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ లతో కలిసి పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతి, సీజనల్ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ... ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి పంటల వైవిధ్యీకరణ అత్యంత ముఖ్యమైన అజెండా అని అన్నారు. గత ఏడాది ఇదే తేదీ నాటికి రాష్ట్రంలో సుమారు 54 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగగా, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 14 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు జరిగిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 1.39 కోట్ల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా ఇప్పటివరకు సగం విస్తీర్ణంలో మాత్రమే సాగు పూర్తైందని తెలిపారు. జిల్లా కంటింజెన్సీ ప్లాన్ ప్రకారం ఏ ఏ రకాల విత్తనాలు ఎంత మేర కావాలో ఇండెంట్ చేసి తెప్పించాలని కలెక్టర్ తెలిపారు. రోజుకు 5 వేల నుండి ఐదున్నర వేల యూనిఫామ్ లు కుట్టడం జరగాలని, ఈ దిశగా పకడ్బందీ కార్యాచరణ చేయాలని అన్నారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... జిల్లాకు చేరిన క్లాత్, ఎంత మేర మండలాలకు పంపిణీ చేసింది, క్లాత్ కటింగ్ కొరకు ఉన్నది, రోజువారీ నివేదిక సమర్పించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్, ఎస్డీసి సదానందం, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, డిఆర్డీవో శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, అధికారులు, తదితరులున్నారు.

## ఎంపీడీఓ శ్రీనివాస్‌ను కలిసిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు



**కరకగూడెం, జూలై 24(పీపుల్స్ డైరీ) :** మండలానికి నూతనంగా ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన పోడిల శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ సర్పంచ్‌లు, పార్టీ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓకు శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి పనిచేస్తామని సర్పంచ్‌లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గ్రామానికి చేరేలా సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు. ప్రజా సేవలో తమ వంతు సహకారం ఉంటుందని బీఆర్ఎస్ నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సమత్ భట్టు పల్లి సర్పంచ్ కొమరం సత్యనారాయణ, రఘు నాథపాలెం సర్పంచ్ పోలెబోయిన రాణి, వట్టం వారి గుంపు సర్పంచ్ వట్టం సందీప్.మరియు బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు రావుల సోమయ్య పాల్గొన్నారు.



## స్మార్ట్ కిడ్జ్‌లో హోరెత్తిన బోనాల జాతర సంబురం

**బోనాలతో కనువిందు చేసిన చిన్నారులు - అమ్మవారికి బోనాలతో ప్రత్యేక పూజలు**

**ఖమ్మం, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తున్న బోనాల సంబురాలు స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శుక్రవారం హోరెత్తాయి. డప్పు దరువులతో, పోతురాజు వేషధారణలతో, అమ్మవారి వేషధారణలతో బోనాలు తలపై పెట్టుకుని పాఠశాల విద్యార్థులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పాఠశాల విద్యార్థులు తమ గృహాలనుంచి బోనాల కుండలతో పాఠశాల ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం బోనాలకు, గౌరీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలను తలపై పెట్టుకున్న విద్యార్థినిలు, ఉపాధ్యాయులు బోనాలతో భారీ ఎత్తున గ్రామోత్సవం నిర్వహించి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామోత్సవం ముందు పోతురాజు వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల సంబురాలు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. ఈ బోనాల వేడుకలు మన తెలంగాణ ప్రాంతాలకే గొప్ప గౌరవాన్ని తీసుకుని వస్తున్నాయని, ప్రపంచవ్యాప్తంగా బోనాల సంబరాలకు ప్రత్యేక స్థానం ఏర్పడిందన్నారు. ఈ బోనాల సంబరాన్ని ఇకముందు కూడా కొనసాగించాల్సిన బాధ్యత నవతరం పైనే ఉందని తెలియజేశారు. బోనాల వేడుకల విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేందుకు ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా బోనాల సంబురాలు నిర్వహించామని, ఈ వేడుకలతో విద్యార్థులలో మన సంస్కృతి, సాంప్రదాయాల పట్ల గౌరవం, ఆనందోత్సవాలు వెల్లి విరిసాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

## నరేందర్ రెడ్డి విజయం నేటి యువతకు స్ఫూర్తిదాయకం: దయాకర్ రెడ్డి



**ఖమ్మం, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** రాకెట్ శాస్త్రవేత్త మోర్తాల నరేందర్ రెడ్డి సాధించిన విజయం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి కొనియాడారు. 'స్కైరూట్ ఏరోస్పేస్' ప్రయోగించిన 'విక్రమ్-1' రాకెట్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఖమ్మం జిల్లా వాసి నరేందర్ రెడ్డిని శుక్రవారం మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో దయాకర్ రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాన్య కుటుంబం నుంచి వచ్చి అంతరిక్ష పరిశోధనా రంగంలో జిల్లా ఖ్యాతిని పెంచడం అభినందనీయమన్నారు. నరేందర్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



## సిరిపురం మేజర్ కాలువను పరిశీలించిన డిప్యూటీ సీఎం

**ఏనుకూరు జులై 24 (పీపుల్స్ డైరీ) :** ఖమ్మం జిల్లా ఏనుకూరు సమీపంలోని సిరిపురం మేజర్ కాలువ పనులను శుక్రవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పరిశీలించారు .కాల్వ పనుల పురోగతి గురించి సంబంధిత కాంట్రాక్టర్ మొగిలి శ్రీనివాసరెడ్డిని, సీతారామ ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అన్నారు. ఏన్కూరు సమీపంలోని సాగర్ కాల్వలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను పరిశీలించారు. గోదావరి జలాలు ఏనుకూరు నుంచి వెనక్కి మళ్ళీ తిమ్మారావుపేట దగ్గర ఎస్కేపు లాకుల ద్వారా వైరా రిజర్వాయర్‌కు వెళుతున్నాయని అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, సూడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ,కొండ బాల కోటేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రం, ఫతే అహ్మద్ ,మలీదు భాస్కర్, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు ,లచ్చిరాం నాయక్, స్వర్ణ నరేందర్, వేముల కృష్ణ ప్రసాద్ ,మేడా ధర్మారావు ,తంబళ్ల సామేలు ,ప్రభావతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ హయాంలో ఖమ్మం అభివృద్ధికి కేటీఆర్ సహకారం

### మాజీ మంత్రి పువ్వాడ



**ఖమ్మం, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూ, ప్రజా సమస్యలను బలంగా లేవనెత్తి ప్రజాగళంగా నిలుస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అద్భుతమైన నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కొనియాడారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయనకు పువ్వాడ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, యువతకు అవకాశాలు, పారిశ్రామిక ప్రగతి, ఐటీ రంగ విస్తరణ, పట్టణాభివృద్ధి వంటి అంశాల్లో కేటీఆర్ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రస్తుతం ప్రతిపక్షంలోనూ ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ సబ్బండ వర్గాల సమస్యలను శాసనసభలోనూ, ప్రజాక్షేత్రంలోనూ గట్టిగా వినిపిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న నాయకుడు కేటీఆర్ అని పువ్వాడ పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయంలో ఖమ్మం జిల్లాతో పాటు నగరం సమగ్రాభివృద్ధి కోసం కోట్ల రూపాయల నిధుల మంజూరులో కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లా అభివృద్ధి కోసం ప్రతి ప్రతిపాదనకు సానుకూలంగా స్పందిస్తూ ఖమ్మాన్ని అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు కేటీఆర్ అందించిన సహకారం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. ప్రజాసేవలో మరింత శక్తి, ఉత్సాహంతో కేటీఆర్ ముందుకు సాగాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆకాంక్షించారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన సంబరాలు

**కరకగూడెం, జూలై 24(పీపుల్స్ డైరీ) :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు 50వ జన్మదిన వేడుకలను కరకగూడెం మండల బిఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ఆదేశానుసారం, కరకగూడెం మండల అధ్యక్షులు రావుల సోమయ్య, మండల నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బ్రెడ్ అందజేసి వారి సేవలను కొనియాడారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రావుల సోమయ్య మాట్లాడుతూ... కేటీఆర్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాబోయే యువతరానికి ఆయనే స్ఫూర్తి అని అన్నారు. కెసిఆర్ , కేటీర్ నాయకత్వంలో 2028 ఎన్నికల్లో తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, యువజన నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేటీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# నీట్, సీబీఎస్ఈ పరీక్షల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి

## వరంగల్ జిల్లాలో కళాశాలలు, విద్యాసంస్థల బంద్ విజయవంతం



**మట్టెవాడ, జూలై 24 (పీపుల్స్ డైరీ):** నీట్, సీబీఎస్ఈ పరీక్షల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఢిల్లీలో విద్యార్థులపై పోలీసు లాఠీచార్జి హేయమైన చర్యని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పైసా గణేష్, ఏ.ఐ.ఎస్.బి జిల్లా నాయకులు తాజ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్ లు అన్నారు. శుక్రవారం ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసుల చర్యను ఖండిస్తూ దేశ వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ సందర్భంగా వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏ.ఐ.ఎస్.బి, ఏఐవైఎఫ్ ఆధ్వర్యం లో వరంగల్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రంగశాయపేట డిగ్రీ, జూనియర్ కళాశాల తరగతులు బహిష్కరించి బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పైసా గణేష్, ఏ.ఐ.ఎస్.బి జిల్లా నాయకులు తాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్ మాట్లాడుతూ నీట్, సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణలో అవక తవకలు, పేపర్ లీకేజీలపై బాధ్యత వహించాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని ఢిల్లీలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఘటనల్లో గాయపడిన విద్యార్థులు, నిరసనకారులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ప్రజాస్వామ్య దేశంలో తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలియచేయడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన ప్రభుత్వం పోలీసు బలప్రయోగా నికి పాల్పడటం బాధాకరమని విమర్శించారు. అదుపులోకి తీసుకున్న విద్యార్థులు, నిరసనకారుల హక్కులకు భంగం కలగకుండా చూడాలని కోరారు. విద్యార్థుల ప్రశ్నలకు లాఠీచార్జ్ సమాధానం కాదని, ప్రభుత్వం మౌనం వీడి వారి సందేహాలకు సమాధానం చెప్పాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థి ప్రతినిధులతో తక్షణమే చర్చలు జరిపి, వారి న్యాయమైన డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఏ.ఐ.ఎస్.బి నాయకులు కంజర్ల లక్కీ, జీలకర్ర కార్తీక్, మేకల అభిరామ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వసీమ్, నాయకులు సమీర్, గౌస్ పాల్గొన్నారు.




## ధర్మాన్ని కాపాడండి..ధర్మేంద్ర ప్రధాన్‌ను కాదు..!

### ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు జయ్యారపు అఖిల్

**నర్సంపేట, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్థూపం దగ్గర విద్యార్థి సంఘాల అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్. యూ.ఐ జిల్లా అధ్యక్షులు జయ్యారపు అఖిల్ మాట్లాడుతూ... నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఘోరంగా విఫలమైన ఎన్‌టీఏను రద్దు చేయాలన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు జరిపిన పాశవిక దాడిని ఖండించారు. దాడికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి

### బిఎస్ఎస్ అధ్యక్షులు మారపెల్లి క్రాంతి కుమార్



**శాయంపేట, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** శాయంపేట మండల కేంద్రంలో బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజ్ కు నిరసనగా జంతర్ మంతర్ వద్ద శాంతియుత ర్యాలీ చేస్తున్న విద్యార్థులపై చేసిన లాఠీ చార్జ్ నీ ఖండిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన సంక్షేమ సంఘం బిఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మారపల్లి క్రాంతి కుమార్ మాట్లాడుతూ, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ పేపర్ లీకేజీలు చేసిన ధర్మేంద్ర ప్రధాన్ ను ప్రభుత్వం నుండి బర్తరఫ్ చేయాలని అన్నారు. బిజెపి ప్రభుత్వం విద్యార్థులతో, రైతులతో చెలగాటం ఆడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సంక్షేమ సంఘం బి ఎస్ ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేపల్లి విజయ్ కుమార్, శాయంపేట మండల అధ్యక్షులు మారపల్లి సుధాకర్, నాయకులు అల్లి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలి

### టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్

**మొగుళ్ళపల్లి, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** మండలలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో. కేంద్ర విద్యాశాఖ మంత్రిగా దర్మేంద్ర ప్రధాన్ ను తక్షణమే పదవి నుండి తొలగించాలని జిల్లా నాయకులతో కలిసి శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కళాశాలల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంద్‌కు సంపూర్ణ సహకారం అందించిన పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు రవి పటేల్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భూపాలపల్లి అంబేద్కర్ కూడలిలో నిర్వహించిన సమావేశంలో రవి పటేల్ మాట్లాడుతూ, గత 23 రోజులుగా నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా విద్యార్థులపై అణచివేతకు పాల్పడ టం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుందని అన్నారు. ఈ



కార్యక్రమంలో టీఆర్పీ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గట్ల రాజన్న, జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, వ్యవసాయ శాఖ జిల్లా అధ్యక్షుడు పింగిడి శంకరయ్య, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రామ్ చరణ్, గునికంటి విష్ణు, ప్రణీత్, శ్రీకాంత్, రాజేష్, రోడ్డ శ్రీనివాస్, నరేష్, రత్నాకర్ పాల్గొన్నారు.

## విద్యార్థులపై దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం

### సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి వీరభద్రం

**ఏన్కూరు, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** సిపిఎం ఏన్కూరు మండల కమిటీ సమావేశం శుక్రవారం రేపల్లెవాడలో మాజీ ఎంపీటీసీ భూక్యా లచ్చు నాయక్ నివాసంలో బానోత్ బాలాజీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువత చేపడుతున్న శాంతియుత ఆందోళనలపై కేంద్ర ప్రభుత్వం దమనకాండ కొనసాగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తీవ్రంగా ఖండించారు. నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీపై న్యాయమైన డిమాండ్లతో విద్యార్థులు ఆందోళన చేస్తున్నప్పటికీ, వారి సమస్యలను పరిష్కరించకుండా వారిపై పోలీసు బలప్రయోగం చేయడం, తప్పుడు ప్రచారం చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని అన్నారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, విద్యార్థులు లేవనెత్తిన అన్ని డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్



చేశారు. దేశ యువత భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, విద్యా వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయతను పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం ఏన్కూరు మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరరావు, మండల నాయకులు ఏర్పుల రాములు, భూక్యా లచ్చు నాయక్, కాలసాని సాయికుమార్, షేక్ జానీ, తమ్మినేని వెంకటయ్య, నామా కృష్ణారావు, ఎనగందుల వీరభద్రం, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల గొంతు నొక్కొద్దు : పరికపల్లి

**ఖమ్మం, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీట్ పేపర్ లీక్ తర్వాత ఆందోళనతో మరణించిన విద్యార్థులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, భవిష్యత్తులో ఆరోపణలకు తావు లేకుండా పరీక్షలు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని, సంసద్ ముట్టడికి బయలుదేరిన విద్యార్థులపై ఢిల్లీ



పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేయటాన్ని కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్ గౌడ్, పెద్దమునగాల పాఠశాల విద్యార్థులు ఖండిస్తూ పాఠశాల ప్రాంగణంలో నిరసన తెలియజేశారు. జూలై 20న పార్లమెంటు ముట్టడికి బయలుదేరిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయటం వలన వందలాది మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడటమే కాకుండా ఒక విద్యార్థిని కూడా మరణించటానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడ్డారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావటం, సిబిఎస్ఈ పరీక్షల మూల్యాంకనంలో తప్పులు దొర్లటం, నీట్ పరీక్ష నిర్వహణలో లోపాలు తలెత్తడంతో దరిదాపు 55 లక్షల మంది విద్యార్థులు ఆందోళనకు గురైనారు కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ వైఫల్యాలకు బాధ్యత వహించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు విద్యార్థుల కు ఎలాంటి భరోసా ఇవ్వలేకపోయిందని కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు డేగల వెంకటేశ్వర్లు, సోలా శీను, పిట్టల వెంకటేశ్వర్లు, దాడే శీను, గన్నరపు అప్పారావు, వెంకయ్య తదితరులున్నారు.

## పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం నూతన కార్యవర్గం ఎన్నిక



**భూపాలపల్లి, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం 2026--2029 సంవత్సరాల కాలానికి నూతన జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో ఎన్నికల అధికారి ఎ. దశరథ రామారావు పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు అనుగుణంగా అన్ని పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలుకావడం, వాటన్నింటినీ పరిశీలనలో చెల్లుబాటు కావడం, ఎలాంటి ఉపసంహరణలు లేకపోవడంతో కార్యవర్గ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా అడగాని సాంబశివుడు, గౌరవ అధ్యక్షుడిగా లింగయ్య, జనరల్ సెక్రటరీగా అంబటి దేవేందర్, కోశాధికారిగా బొజ్జం వీరయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు అడగాని సాంబశివుడు మాట్లాడుతూ.. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి కుమార్, జనరల్ సెక్రటరీ దశరథ రామారావు, ములుగు జిల్లా అధ్యక్షుడు పోలు రాజు, టీపీఎస్ సీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రమణ, గౌరవ అధ్యక్షుడు కల్లెపు సదానందం, నూతన కార్యవర్గ సభ్యులు, జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బ్యాటరీలను దొంగలించిన దొంగలను పట్టుకున్న పోలీసులు



**నర్సంపేట, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** ఇటీవల పాకాల రోడ్డు లోని బండల షాపు లో ఉన్న రెండు గూడ్స్ ట్రాలీ ల బ్యాటరీ లను దొంగిలించిన దొంగలను పట్టుకున్నారు. .పట్టుబడిన వారు 1. ఎస్.కె నాయాబ్ రసూల్ , గ్రామం ఎన్‌ంజి ఓ ఎస్ కాలనీ ,2. ముద్దంగుల . మహేష్ గ్రామం వడ్డెర కాలిని, పరారీలో ఉన్న వ్యక్తి : ప్రవీణ్ శుక్రవారం రోజు మహబూబాబాద్ రోడ్డులో వాహనాలు తనిఖీలు చేయుచుండగా ఒక ఆటోలో ముగ్గురు వ్యక్తులు వస్తు పోలీసు వారిని చూసి పారిపోతుండగా వారిని పట్టుకోగా అందులో ఒకడు పరారీ అయినాడు. మిగతా ఇద్దరిని విచారించగా ఆటోలో దొంగిలించిన బ్యాటరీలు ఉన్నాయని దొంగతనం గురించి చెప్పినారు. పట్టుబడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసి బ్యాటరీలను ఆటోను స్వాధీన పరచుకోవడం జరిగిందని ఎస్ ఐ అరుణ్ కుమార్ తెలిపారు.

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**ఏన్కూరు, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని గార్లవొడ్డు,జన్నారం బి రాఘవాపురం, కేసుపల్లి, గంగుల నాచారం గ్రామాలలో వర్షాభావ పరిస్థితులపై గ్రామసభ లు జరిగాయి. ఇందులో భాగంగా ఎల్నినో ఎఫెక్ట్ వలన వర్షాభావం తక్కువగా నమోదవుతున్న వేళ రైతులకు వరి, మొక్కజొన్న మరియు మిరప లాంటి అధిక నీటి వినియోగం పంటలను వేయకుండా ప్రత్యామ్నాయ పంటలైన పంటలు అపరాల పంటలైన కందులు, పెసర్లు ,మినుములు తృణధాన్య పంటలైన జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు మరియు నూనె గింజల పంటలైన నువ్వులు, వేరుశెనగ వంటి పంటలు వేసుకుని ఈ ఎల్లిలో ప్రభావం నుంచి బయటపడాల్సిందిగా చెప్పారు. కార్యక్రమంలో ఆయ గ్రామ సర్పంచులు భూక్యా నర్సి బానోతు వెంకన్న మల్కామ్ లక్ష్మి, బి.రాఘవాపురం



సర్పంచ్ వైస్ మండల వ్యవసాయ అధికారి అవుకు నరసింహారావు, వ్యవసాయ విస్తరణ అధికారులు సైదులు, లహరి, అశోక్, నవ్య, పంచాయతీ సెక్రటరీలు, ఇరిగేషన్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ అధికారులు, ఎలక్ట్రీషియన్ డిపార్ట్మెంట్, వెటర్నరీ డిపార్ట్మెంట్ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ నారాయణలో ముందస్తు బోనాల వేడుకలు

**గణపురం, జూలై 24 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను గణపురం మండల కేంద్రంలోని శ్రీ నారాయణ హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల బోనాలను అందంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నాగనబోయిన రవి, కరస్పాండెంట్ పోతుగంటి శశిధర చారి మాట్లాడుతూ... బోనాలు తెలంగాణ సంస్కృతి, ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని పేర్కొన్నారు. ఆషాఢ మాసంలో మహంకాళి, పోచమ్మ, ఎల్లమ్మ వంటి గ్రామదే వతలకు భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించడం



ఆనవాయితీ అని తెలిపారు. 'బోనం' అంటే భోజనం అని, అమ్మవారికి సమర్పించే నైవేద్యానికే ఆ పేరు వచ్చిందని వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పోతుగంటి స్వప్న చారి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com